'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 82 | శుక్రవారం | 6.11.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 82 | Friday | 6.11.2026 | Pages: 8 | Rate: 2



## వద్దు మహా ప్రభో ఇక చాలు తప్పుకో..

- వెళ్లు ట్రంప్.. వెళ్లూ..
- ఏం చెప్పావ్.. ఏం చేశావ్
- ట్రంప్‌ను వీటో చేసిన అమెరికన్లు

7లో..

యుద్ధం గెలిచామన్న ధీమా.. ఎన్నికల్లో మాత్రం ఘోర పరాజయం! ప్రపంచాన్ని శాసించే అగ్రరాజ్యం అమెరికాలో ఇప్పుడు రాజకీయ ప్రకంపనలు. ప్రజల ప్రయోజనాలే పరమావధి అంటూ అధికారంలోకి వచ్చిన డొనాల్డ్ ట్రంప్‌కు ఇరాన్ యుద్ధం రాజకీయంగా ఎదురుదెబ్బ తీసుకొచ్చిందా? ధరలు మండుతుంటే.. కుటుంబాల బడ్జెట్లు కుప్పకూలుతుంటే.. విదేశీ యుద్ధాలకు ఎందుకంత ప్రాధాన్యత ఇచ్చారంటూ అమెరికన్లు నిలదీశారా? మధ్యంతర ఎన్నికల్లో ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌నూ డెమోక్రాట్లకు అప్పగించి ట్రంప్‌కు ప్రజలు షాకిచ్చారు. రిపబ్లికన్ల కంచుకోటల్లోనూ పాగా వేసి అధికార సమీకరణాలను తలకిందులు చేశారు. ఈ ఓటమిపై సొంత ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలు మరింత సంచలనం రేపుతున్నాయి. "మనం ఓడిపోయింది యుద్ధం వల్లే" అంటూ ట్రంప్ విధానాలనే ప్రశ్నించారు. అటు ప్రజలు ధరల తగ్గింపు కోరుతుంటే.. ఇటు ట్రంప్ వైట్‌హౌస్ విలాసవంతమైన బాల్‌రూమ్ నిర్మాణంపై మురిసిపోవడం చర్చనీయాంశమైంది. మరి ఇది కేవలం ఎన్నికల ఓటమా? లేక ట్రంప్ నాయకత్వానికి ప్రజలు ఇచ్చిన హెచ్చరికా? 2028 అధ్యక్ష ఎన్నికలకు ఇప్పుడే మొదలైన సంకేతమా? అమెరికా ఫస్ట్ నినాదానికే అమెరికా ఓటర్లు చెక్ పెట్టారా?

### మాటలకే పరిమితమా..
## చర్యలు ఎక్కడ?

**ఆర్ఆర్ ట్యాక్స్ అంటూ కేటీఆర్ ఆరోపణలు!**



2లో..

హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్లు జరుగుతున్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. నగరంలోని ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా ప్రతి చదరపు అడుగుకు రూ.200 చొప్పున ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారనే విషయం చెబుతారని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.



3లో..

## మంత్రికి, ఎమ్మెల్యేకు టీపీసీసీ చీఫ్ పిలుపు బేఖాతర్!

**గాంధీభవన్ సమావేశానికి ఇద్దరు నేతలు దూరం**

**వివాదానికి తెరదించాలన్న ప్రయత్నానికి బ్రేక్**

తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మధ్య నెలకొన్న వివాదం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్‌కుమార్ గౌడ్ గురువారం గాంధీభవన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

### అప్పుల ఒత్తిడిలో అధికారులు

**పెండింగ్ ఎన్నికల బిల్లులు చెల్లించండి!**

**సీఈవోకు డిప్యూటీ కలెక్టర్ల సంఘం వినతి**



ఎన్నికల నిర్వహణ ఖర్చులు చెల్లించకపోవడంతో అధికారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు) అసిస్టెంట్

రిటర్నింగ్ అధికారులు (ఏఆర్వోలు) చేసిన ఖర్చులు కేటాయించిన బడ్జెట్‌ను మించాయని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. లచ్చిరెడ్డి తెలిపారు. (వివరాలు 2లో..)



## చెన్నైలో పెళ్లి వేడుక

- ప్రముఖుల కలయిక
- జగన్, విజయ్, కేటీఆర్ హాజరు
- ఒకే కుటుంబ వేడుకలు.. వేర్వేరు రాజకీయ భేటీలు!

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల వైఎస్ షర్మిల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తన కుమారుడి వివాహానికి ఆహ్వానించారు. ఈ భేటీ రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. తాజాగా వైఎస్ జగన్ సోదరుడు వైఎస్ అనిల్‌రెడ్డి వివాహ వేడుకలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సందడి చేశారు. ఇలా ఒకవైపు షర్మిల రేవంత్‌రెడ్డిని కలవడం, మరోవైపు జగన్ కుటుంబ వేడుకలో కేటీఆర్ కనిపించడం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. (వివరాలు 3లో..)



# పెట్టుబడుల వేటకు ప్రపంచ వేదిక

**ఫ్యూచర్ సిటీలో మూడు రోజుల గ్లోబల్ సమ్మిట్**

ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలు, పెట్టుబడిదారులు, సాంకేతిక నిపుణులను ఆకర్షించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో మూడు రోజులపాటు ఈ సదస్సు జరగనుంది. ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షించారు. గత ఏడాది నిర్వహించిన తెలంగాణ రైజింగ్ సమ్మిట్ కంటే ఈసారి మరింత భారీగా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

## కొడంగల్‌లో సీఎం అభివృద్ధి జాతర!

**3 రోజుల పర్యటన, ₹ 9,100 కోట్ల పనులు**



కొడంగల్‌లో అభివృద్ధి పండుగకు రంగం సిద్ధమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నవంబర్ 7, 8, 9 తేదీల్లో మూడు రోజులపాటు కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించడంతోపాటు వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, పూర్తయిన ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. మొత్తం రూ.9,053.48 కోట్ల అంచనా వ్యయంతో 13 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. నవంబర్ 7న హకీంపేటలో రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించి వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులు, పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి సమావేశమవుతారు. నవంబర్ 8న స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమై పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.81 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తారు. (వివరాలు 2లో..)

## ఇందిరమ్మ ఇళ్లలో సీఎం దీపావళి!

**లబ్ధిదారుల ఇళ్లలోనే పండుగ సంబరాలు**

పేదల సొంతింటి కల సాకారమవుతున్న వేళ.. ఆ ఆనందంలో భాగస్వామిని అవుతా! ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ఈ దీపావళి పండుగను జరుపుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. పేద కుటుంబాలకు సొంతింటి కల నిజమవుతున్న శుభ సందర్భంలో వారి కొత్త ఇళ్లలో దీపావళి వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో సొంతింటి ఆనందాన్ని పొందుతున్న లబ్ధిదారుల మధ్యకు వెళ్లి వారితో కలిసి పండుగ జరుపుకుంటానని సీఎం తన పోస్టులో వెల్లడించారు. పేదల ఇంట్లో దీపం వెలిగే వేళ వారితో కలిసి పండుగ చేసుకోవడం తనకు ప్రత్యేక ఆనందమని పేర్కొన్నారు. ఈ దీపావళిని ఇందిరమ్మ ఇళ్లలోనే లబ్ధిదారులతో కలిసి జరుపుకోవాలని తన నిర్ణయాన్ని ప్రకటించారు. (వివరాలు 2లో..)






## ప్రాణాలకు తెగించిన తెగువ

**వరదల్లో అభయహస్తం**

**ఎస్డీఆర్ఎఫ్‌కు మంత్రి సత్కారం!**

ప్రాణాలకు తెగించి.. ప్రజల భద్రతే లక్ష్యంగా! భారీ వర్షాలు, వరదలతో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడిన సమయంలో అద్భుతమైన సేవలు అందించిన రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్) సిబ్బందిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశంసల జల్లు కురిపించారు. బేతుపల్లి పెద్ద చెరువు ఉప్పొంగడంతో పాటు దమ్మపేట మండలంలోని పలు గ్రామాలకు వరద ముప్పు ఏర్పడినప్పుడు సిబ్బంది తక్షణమే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారని కొనియాడారు.



## కాళేశ్వరం బ్యారేజీలకు మళ్లీ జీవం..

**భద్రత విషయంలో రాజీ వద్దు!**

**నిపుణుల పర్యవేక్షణలోనే పునరుద్ధరణ!**

**డిసెంబర్‌లో పనుల ప్రారంభానికి సీఎం ఆదేశాలు**

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, జాతీయ డ్యామ్ సేఫ్టీ నిపుణుల సూచనలు, మార్గదర్శకాల ప్రకారమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. (వివరాలు 2లో..)



## జల సంరక్షణతో పల్లెలకు ఉపాధి భరోసా

**6 నెలల రాష్ట్రవ్యాప్తంగా భారీ కార్యాచరణ**

తెలంగాణలో జలవనరుల పునరుద్ధరణతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. 2027 జనవరి నుంచి జూన్ వరకు ఆరు నెలలపాటు రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు నీటిపారుదల, (వివరాలు 2లో..)

# ట్రంప్‌కి ప్రతికూల రిజల్ట్..
# మోదీ అవుతారా అలర్ట్!?




అధికారం ఉంది.. నాయకుడికి ప్రజాదరణ ఉంది.. ప్రత్యర్థులను చీల్చే రాజకీయ వ్యూహాలున్నాయి.. అయినా ప్రజల తీర్పు ముందు ఇవేవీ శాశ్వత రక్షణ కవచాలు కావని అమెరికా ఎన్నికలు మరోసారి చాటిచెప్పాయా? రెండేళ్లకే ట్రంప్ ప్రభుత్వానికి ఎదురైన రాజకీయ ఎదురుదెబ్బ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చకు తెరలేపుతోంది. మరి ఈ అమెరికా తీర్పు మోదీకి ఎలాంటి సంకేతం ఇస్తోంది? 2024లో సొంత మెజారిటీ కోల్పోయిన బీజేపీ.. ఆ తర్వాత మళ్లీ ఎలా పుంజుకుంది? మహారాష్ట్రలో ప్రత్యర్థి పార్టీల చీలికలు, కొత్త కూటముల వెనుక ఉన్న రాజకీయ లెక్కలేమిటి? ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ విమర్శలు.. ఎస్ఐఆర్ వివాదం.. మరోవైపు రైతు చట్టాల రద్దు నుంచి అగ్నివీర్ విధానంలో కీలక మార్పుల వరకు మోదీ సర్కార్ పునరాలోచన ఎందుకు చేయాల్సి వచ్చింది? ఇవన్నీ రాజకీయ వ్యూహాలా? ప్రజా వ్యతిరేకత ప్రభావమా? బీజేపీ విస్తరణ వెనుక అసలు బలమేమిటి? ప్రతిపక్షాల బలహీనత ఎంతవరకు ఆ పార్టీకి కలిసొస్తోంది? ట్రంప్‌కు వచ్చిన ఎదురుదెబ్బ మోదీకి ముందస్తు హెచ్చరికా? లేక భారత రాజకీయాలకు అమెరికా నేర్పుతున్న మరో ప్రజాస్వామ్య పాఠమా?



## ప్రళయ్ క్షిపణి పరీక్ష సక్సెస్

**స్వదేశీ రక్షణ శక్తికి మరో పదును**

**హైదరాబాద్‌లో రూపకల్పన**

శత్రువులకు సవాల్.. భారత అమ్ములపొదిలోకి మరో అత్యాధునిక అస్త్రం! దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా భారత్ మరో కీలక విజయం సాధించింది. రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'ప్రళయ్' క్వాసీ బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. గురువారం ఉదయం 11.10 గంటలకు ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ఈ ప్రయోగం నిర్వహించారు. (3లో..)



## అరెస్ట్ అంటే అదుపులోకి తీసుకున్న క్షణమే!

**24 గంటల నిబంధనపై సుప్రీంకోర్టు సంచలనం**

పోలీసుల అదుపులోకి వచ్చిన క్షణం నుంచే 24 గంటల గడువు ప్రారంభమవుతుందని సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. నిందితుడి శరీరాన్ని తాకి, అతడి స్వేచ్ఛను నిరోధించిన క్షణమే దానిని అరెస్ట్‌గా పరిగణించాలని స్పష్టం చేసింది. అధికారికంగా అరెస్ట్ నమోదు చేసిన సమయం నుంచి కాకుండా, తొలిసారి అదుపులోకి తీసుకున్న సమయం నుంచే న్యాయమూర్తి ముందు హాజరుపరిచే గడువు లెక్కించాలని తేల్చిచెప్పింది. (3లో..)



## రాష్ట్రాలకు కేంద్రం భారీ నిధులు!

**పండుగ వేళ లక్ష కోట్లు విడుదల**

రాష్ట్రాల ఖజానాలకు కేంద్రం భారీ ఊరట కల్పించింది. పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పన్నుల వాటాలో నెలవారీ నిధులను ముందుగానే విడుదల చేసింది. సాధారణంగా ప్రతి నెల 10వ తేదీన విడుదల చేసే నిధులను ఈసారి ఐదు రోజుల ముందుగానే, నవంబర్ 5న రాష్ట్రాల ఖాతాల్లో జమ చేసింది. మొత్తం రూ.1,09,019 కోట్లను గురువారం విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. (3లో..)



## దూసుకెళ్లిన స్టాక్ మార్కెట్

**ఆరు రోజుల్లో 8 శాతం లాభాలు**

**₹ 29 లక్షల కోట్ల సంపద సృష్టి!**

**విదేశీ పెట్టుబడుల రాకతో కొత్త జోష్**

సెన్సెక్స్, నిఫ్టీలకు భారీ లాభాలు.. దేశీయ స్టాక్ మార్కెట్లు ఏడు నెలల గరిష్ఠ స్థాయిలో ఒక్కరోజు ర్యాలీని నమోదు చేశాయి. వరుసగా ఆరు ట్రేడింగ్ సెషన్లుగా సాగుతున్న లాభాలతో ఇన్వెస్టర్ల సంపద సుమారు రూ.29 లక్షల కోట్లు పెరిగింది. గురువారం సెన్సెక్స్ ఏకంగా 2,008.61 పాయింట్లు, 2.60 శాతం లాభంతో 79,310.01 వద్ద ముగిసింది. నిఫ్టీ 576 పాయింట్లు, 2.40 శాతం పెరిగి 24,536.60కు చేరింది. (3లో..)

# పెట్టుబడుల వేటకు ప్రపంచ వేదిక

## ఫ్యూచర్ సిటీలో మూడు రోజుల గ్లోబల్ సమ్మిట్



గతంలో ఒక ఎక్స్‌పో హాల్ ఉండగా, ఈసారి ఆరు ప్రత్యేక ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు ప్రధాన హాళ్లలో 52 రంగాలకు సంబంధించిన సమావేశాలు నిర్వహించనున్నారు. సుమారు 3,500 ఆహ్వానాలు పంపించడంతో పాటు 25 రంగాలవారీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేశారు. ప్రతినిధులకు విమానాశ్రయం నుంచి తిరుగు ప్రయాణం వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక లైజనింగ్ అధికారులను నియమించాలని సీఎం ఆదేశించారు. ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారి, భద్రతా అధికారి ఉండాలని, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పెట్టుబడులకు ఆసక్తి చూపే కంపెనీల ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. నవంబర్ 15 నాటికి పూర్తి కార్యాచరణ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

**రక్షణ రంగం నుంచి స్టార్టప్‌ల వరకు ప్రత్యేక ప్రదర్శనలు!**

సమ్మిట్‌లో రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, స్టార్టప్ పెవిలియన్, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, వ్యవసాయ ప్రదర్శన, తెలంగాణ పెవిలియన్, ఎడ్యుకేషన్ ఎక్స్‌పో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. రక్షా ఎక్స్‌పోలో రక్షణ, ఏరోస్పేస్, అంతరిక్షం, సైబర్ సెక్యూరిటీ రంగాలకు చెందిన డ్రోన్లు, రోబోటిక్స్, ఆధునిక పరికరాలను ప్రదర్శించనున్నారు. మైమానిక విన్యాసాలకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం 575 సంస్థలను ఆహ్వానించగా, 49 సంస్థలు ఇప్పటికే ఆసక్తి చూపాయి. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాలకు ఇండియా జాయ్-2026 వేదిక కానుంది. స్టార్టప్ పెవిలియన్‌లో 136 సంస్థల ఆవిష్కరణలను ప్రదర్శించనున్నారు. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, మౌలిక సదుపాయాల సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను ఆహ్వానిస్తూ నవంబర్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలకు చెందిన 60 కంపెనీల ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయ డ్రోన్లు, ఆధునిక సాగు పద్ధతులు, పాడి, మత్స్య, ఆహార శుద్ధి పరిశ్రమలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, చేనేత, బతుకమ్మ, కాకతీయ శిల్పకళతోపాటు రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధిని ప్రతిబింబించేలా ప్రత్యేక పెవిలియన్ రూపొందిస్తున్నారు. పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ ప్రతినిధులకు పరిచయం చేయాలని సీఎం సూచించారు. విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ 'నర్సరీ నుంచి ఆక్స్‌ఫర్డ్ వరకు' తెలంగాణ విద్యారంగ ప్రస్థానాన్ని ప్రదర్శించాలని ఆదేశించారు.

**వాతావరణ మార్పులపై ప్రత్యేక కాంక్లేవ్!**

పెట్టుబడులు, పరిశ్రమలతోపాటు భవిష్యత్ పర్యావరణ సవాళ్లపైనా సమ్మిట్‌లో విస్తృత చర్చ జరగనుంది. డిసెంబర్ 8న ప్రత్యేకంగా తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ నిర్వహించనున్నారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు, కరువు పరిస్థితులను ఎదుర్కొనే మార్గాలపై సుమారు 200 మంది శాస్త్రవేత్తలు, రైతులు, నిపుణులు చర్చించనున్నారు. కరువును తట్టుకునే వ్యవసాయం, పశుసంరక్షణ, తాగునీటి భద్రత, అధిక ఉష్ణోగ్రతల నుంచి రక్షణ, అడవులు, జీవవైవిధ్య పరిరక్షణ, వ్యర్థాలను సంపదగా మార్చడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తక్షణ చర్యలతోపాటు దీర్ఘకాలిక పరిష్కారాలతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. సమ్మిట్ ఏర్పాట్ల పర్యవేక్షణకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, గడ్డం వివేక్‌లతో మంత్రివర్గ ఉపసంఘం పనిచేయనుంది. అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, వసతి, ప్రొటోకాల్, భద్రత, ప్రదర్శనల నిర్వహణ కోసం పది అధికారుల కమిటీలను ఏర్పాటు చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణను ఒకే వేదికపైకి తీసుకొస్తూ తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడుల గమ్యస్థానంగా నిలబెట్టడమే ఈ గ్లోబల్ సమ్మిట్ ప్రధాన లక్ష్యం.

# కొడంగల్‌లో సీఎం అభివృద్ధి జాతర!

## 3 రోజుల పర్యటన, ₹ 9,100 కోట్ల పనులు



**రూ.5,060 కోట్లతో రేడియల్ రోడ్డు!**

ఈ పర్యటనలో చేపట్టనున్న ప్రధాన ప్రాజెక్టుల్లో కొత్తవాల్‌గూడ నుంచి నాచారం వరకు నిర్మించనున్న రేడియల్ రోడ్డు-2 అత్యంత కీలకం. రూ.5,060 కోట్లతో నిర్మించే ఈ రహదారి ఔటర్ రింగ్ రోడ్డు వద్ద కొత్తవాల్‌గూడ నుంచి జాతీయ రహదారి 167ఎన్ వరకు అనుసంధానం కానుంది. ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.1,410 కోట్లతో 223 కొత్త, అసంపూర్తి బీటీ రహదారుల పనులు, రూ.2,100 కోట్లతో ఎంఎన్‌కేఎల్ఐఎస్ రెండో దశ పనులు చేపట్టనున్నారు. విద్యారంగంలో రూ.118.80 కోట్లతో 10 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, రూ.123 కోట్లతో కొడంగల్ వ్యవసాయ కళాశాల నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభించనున్నారు. కొడంగల్, కోస్గి, మద్దూరులో రూ.41.83 కోట్లతో ఆధునిక బస్‌స్టాండ్లు, మద్దూరులో రూ.20 కోట్లతో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ నైపుణ్యాభివృద్ధి కేంద్రం, మరో రూ.20 కోట్లతో సమీకృత డివిజనల్ కార్యాలయ సముదాయం ఏర్పాటు చేయనున్నారు. రూ.59.30 కోట్లతో రహదారులు, తిమ్మారెడ్డిపల్లిలో గురులోక మసంద్ ప్రభు మందిరం అభివృద్ధికి రూ.4.45 కోట్లు, కొడంగల్ నిరంజన్ మఠం అభివృద్ధికి రూ.5.10 కోట్లు కేటాయించారు. హకీంపేట ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.10 కోట్లతో పర్యాటక హోటల్ నిర్మించనున్నారు. మరోవైపు ఇప్పటికే రూ.46.08 కోట్లతో నిర్మించిన 10 ప్రభుత్వ భవనాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, పోలీస్ స్టేషన్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సమీకృత మండల కార్యాలయం, సైన్స్ మ్యూజియం ఉన్నాయి.

**50 వేల మంది రైతులతో భారీ సభ!**

నవంబర్ 9న ముఖ్యమంత్రి హకీంపేటలో నిర్వహించే భారీ రైతు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. సాయంత్రం 4 గంటలకు కొడంగల్ నివాసం నుంచి బయలుదేరి హకీంపేట చేరుకుంటారు. రాత్రి 7 గంటల వరకు జరిగే సభలో రైతులను ఉద్దేశించి మాట్లాడతారు. రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులను సమీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజుల పర్యటనలో రైతులతో ముఖాముఖి, మహిళా సంఘాలతో సమావేశాలు, పారిశ్రామికవేత్తలతో చర్చలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రైతు మేళా ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పరిశ్రమల ప్రదర్శన ద్వారా పెట్టుబడి అవకాశాలను పరిచయం చేయనున్నారు. రూ.9 వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులు, కొత్త పరిశ్రమలు, విద్యా సంస్థలు, రహదారులు, ప్రజా భవనాల ప్రారంభాలతో కొడంగల్‌ను అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ పర్యటన సాగనుంది.

## ఇందిరమ్మ ఇళ్లలో సీఎం దీపావళి!

- లబ్ధిదారుల ఇళ్లలోనే పండుగ సంబరాలు
- ప్రజాప్రతినిధులు, అధికారులకు సీఎం పిలుపు!

రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, ప్రజా నాయకులు, ప్రభుత్వ అధికారులు కూడా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. వారి కుటుంబాలతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొని సంతోషాన్ని పంచుకోవాలని కోరారు. పేదల సొంతింటి కల సాకారమైన సందర్భాన్ని ఒక సామూహిక పండుగగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రతినిధులు లబ్ధిదారుల మధ్యకు వెళ్లి వారి ఆనందంలో భాగస్వాములు కావాలన్నది సీఎం సందేశంలోని ప్రధాన ఉద్దేశం. ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వేడుకల ద్వారా పేద కుటుంబాలకు ఆత్మీయత, భరోసా కల్పించాలని రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.



# ప్రాణాలకు తెగించిన తెగువ

- వరదల్లో అభయహస్తం
- ఎస్డీఆర్ఎఫ్‌కు మంత్రి సత్కారం!

ప్రాణాలకు తెగించి..ప్రజల భద్రతే లక్ష్యంగా! భారీ వర్షాలు, వరదలతో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడిన సమయంలో అద్భుతమైన సేవలు అందించిన రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్) సిబ్బందిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశంసల జల్లు కురిపించారు. బేతుపల్లి పెద్ద చెరువు ఉప్పొంగడంతో పాటు దమ్మపేట మండలంలోని పలు గ్రామాలకు వరద ముప్పు ఏర్పడినప్పుడు సిబ్బంది తక్షణమే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారని కొనియాడారు. విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలు కాపాడేందుకు చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. గురువారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి మంత్రి వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు.

**ధైర్యసాహసాలకు అభినందనలు!**

సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్ద చెరువు వద్ద పరిస్థితిని పరిశీలించిన మంత్రి, అనంతరం దమ్మపేట మండలంలోని మల్లెపూల వాగు, ముసలిబంధం చెరువుల గండ్లు పడిన ప్రాంతాలను సందర్శించి సహాయక చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా వరద బాధితులకు అండగా నిలిచిన ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. వారికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ప్రజల భద్రత కోసం చూపిన తెగువ, అంకితభావం, విధి నిర్వహణలో ప్రదర్శించిన ధైర్యం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. విపత్తుల సమయంలో ప్రజలకు రక్షణ కల్పించడంలో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది పోషిస్తున్న పాత్రను ప్రశంసించారు.

# జల సంరక్షణతో పల్లెలకు ఉపాధి భరోసా

## 6 నెలల రాష్ట్రవ్యాప్తంగా భారీ కార్యాచరణ

...నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. గురువారం సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ వివరాలు తెలిపారు. నీటిపారుదల, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ కూలీలు, గ్రామస్థులను పెద్దఎత్తున భాగస్వాములను చేయనున్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే కరువు పరిస్థితులను ముందుగానే ఎదుర్కొంటూ, శాశ్వత జలవనరుల ఆస్తులను సృష్టించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. ఇప్పటికే 355 రకాల పనులను గుర్తించినట్లు తెలిపారు.


**చెరువులు, కాలువలకు పూర్వవైభవం!**

గ్రామాల్లోని చెరువులు, కుంటలు, చిన్ననీటి పారుదల వనరులు, వాగులు, కాలువల పునరుద్ధరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. చెరువుల్లో పేరుకుపోయిన పూడిక తొలగించడం, దెబ్బతిన్న తూములు, గేట్ల మరమ్మతులు, ముళ్లపొదలు, పిచ్చిమొక్కల తొలగింపు వంటి పనులు చేపట్టనున్నారు. సంప్రదాయ జలసేకరణ నిర్మాణాలకు తిరిగి జీవం పోయడంతోపాటు పొలాలకు నీరు చేరే పంటకాలువలను అభివృద్ధి చేయనున్నారు. చిన్న నదులు, వాగులపై అవసరమైన చోట చెక్‌డ్యామ్‌లు నిర్మించి వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భజలాలను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. రాజస్థాన్, మహారాష్ట్రల్లో విజయవంతమైన భూగర్భజలాల పెంపుదల కార్యక్రమాలను అధ్యయనం చేసి తెలంగాణకు అనువైన విధానాలను అమలు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి భూగర్భజల శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రధానంగా వినియోగించుకుంటూ 60:40 నిధుల నిష్పత్తిలో పనులు చేపట్టనున్నారు. అవసరమైన అదనపు నిధులను రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చుతుందని మంత్రి భరోసా ఇచ్చారు.



# మాటలకే పరిమితమా.. చర్యలు ఎక్కడ?

**ఆర్ఆర్ ట్యాక్స్ అంటూ కేటీఆర్ ఆరోపణలు!**



హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్లు జరుగుతున్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. నగరంలోని ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా ప్రతి చదరపు అడుగుకు రూ.200 చొప్పున ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారనే విషయం చెబుతారని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. ఈ వ్యవహారం వాస్తవమేనని హైదరాబాద్ నిర్మాణ రంగానికి చెందిన వారిని అడిగితే తెలుస్తుందని వ్యాఖ్యానించారు. ఈ ఆరోపణలతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి ఆర్ఆర్ ట్యాక్స్ అంశాన్ని చర్చకు తీసుకొచ్చారు.

**మోదీ, అమిత్‌షాపై నేరుగా ప్రశ్నలు**

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తరచూ హైదరాబాద్‌కు వచ్చి సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారంటూ ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే ఆరోపణలు చేస్తున్న నేతలు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. మోదీని 'బడా భాయ్'గా, రేవంత్‌రెడ్డిని 'ఏబీవీపీ ఛోటా భాయ్'గా అభివర్ణిస్తూ, తన సన్నిహితుడిపై మోదీ ఎప్పటికీ చర్యలు తీసుకోరని ఎద్దేవా చేశారు. బీజేపీ నేతలది కేవలం మాటల హడావుడేనని, ఆర్ఆర్ ట్యాక్స్‌పై ఆచరణలో ఎలాంటి చర్యలు ఉండవని వ్యాఖ్యానించారు. 'పెద్ద మాటలు..చర్యలు శూన్యం' అంటూ తన పోస్టును ముగించారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చకు దారితీశాయి.



# అప్పుల ఒత్తిడిలో అధికారులు

## పెండింగ్ ఎన్నికల బిల్లులు చెల్లించండి!

### సీఈవోకు డిప్యూటీ కలెక్టర్ల సంఘం వినతి

ఎన్నికల నిర్వహణ ఖర్చులు చెల్లించకపోవడంతో అధికారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్వోలు) చేసిన ఖర్చులు కేటాయించిన బడ్జెట్‌ను మించాయని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. లచ్చిరెడ్డి తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డిని కలిసి పెండింగ్ బిల్లులు, అదనపు ఖర్చుల చెల్లింపులపై వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల నిర్వహణకు కేటాయించిన నిధులు సరిపోకపోవడంతో పలువురు అధికారులు వ్యక్తిగతంగా అప్పులు తెచ్చి ఖర్చులు భరించాల్సి వచ్చిందని వివరించారు. ఆ ఖర్చులకు సంబంధించిన బిల్లులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని పేర్కొన్నారు.

**అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు.. గౌరవానికి భంగం**

బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా అప్పులిచ్చిన కొందరు వ్యక్తులు కోర్టులను ఆశ్రయిస్తుండగా, మరికొందరు మాజీ ఆర్వోలు, ఏఆర్వోల ఇళ్లకు, కార్యాలయాలకు వెళ్లి డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని లచ్చిరెడ్డి వెల్లడించారు. దీంతో అధికారులు ఆర్థిక ఇబ్బందులతో పాటు వ్యక్తిగత గౌరవం, వృత్తిపరమైన ప్రతిష్ఠకు భంగం కలిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. అదనపు బడ్జెట్ కోసం సంబంధిత అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు పంపినా అవి వివిధ స్థాయుల్లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నాంపల్లి అసెంబ్లీ, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాల అదనపు ఖర్చుల ప్రతిపాదనలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. పెండింగ్ బిల్లులను పరిశీలించి, అదనపు నిధులు మంజూరు చేసి వెంటనే చెల్లింపులు చేపట్టాలని సీఈవోను సంఘం కోరింది.

# కాళేశ్వరం బ్యారేజీలకు మళ్లీ జీవం..

- భద్రత విషయంలో రాజీ వద్దు!
- నిపుణుల పర్యవేక్షణలోనే పునరుద్ధరణ!
- డిసెంబర్‌లో పనుల ప్రారంభానికి సీఎం ఆదేశాలు





మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, జాతీయ డ్యామ్ సేఫ్టీ నిపుణుల సూచనలు, మార్గదర్శకాల ప్రకారమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన నిర్మాణ లోపాలు పునరావృతం కాకుండా అత్యంత జాగ్రత్తగా పనులు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. మూడు బ్యారేజీలను సురక్షితంగా తిరిగి వినియోగంలోకి తీసుకురావడమే లక్ష్యంగా మంత్రులు, నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సుమారు రూ.4,193 కోట్ల అంచనాతో పునరుద్ధరణ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. కేంద్ర నిపుణుల కమిటీ ప్రాథమిక ప్రణాళికలకు ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఈ నెలాఖరులోగా తుది అనుమతులు పొందాలని, ఈ ఏడాది చివరిలోగా పనులు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. పనుల జాప్యానికి అవకాశం లేకుండా అన్ని ప్రక్రియలను సమాంతరంగా కొనసాగించాలని సూచించారు.

**మేడిగడ్డ నీటిపై తప్పుడు ప్రచారానికి చెక్!**

మేడిగడ్డ వద్ద నీళ్లు ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటిని లిఫ్ట్ చేయడం లేదంటూ జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని సీఎం మంత్రులకు సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడి నీటిని సాంకేతికంగా ఎత్తిపోసే అవకాశం లేదని ఇంజనీర్లు వివరించారు. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించాలంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు మూసివేయాల్సి ఉంటుందని తెలిపారు. అయితే నిర్మాణ లోపాల కారణంగా ఆ రెండు బ్యారేజీల గేట్లను తెరిచే ఉంచాలని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సూచించిన విషయాన్ని గుర్తుచేశారు. మరోవైపు దిగువ గోదావరి జలాలను వృథా చేయకుండా దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా వినియోగిస్తున్నామని సీఎం తెలిపారు. గతంలో దేవాదుల ద్వారా ఏడాదికి సగటున 9.57 టీఎంసీలు మాత్రమే లిఫ్ట్ చేయగా, గత మూడేళ్లలో సగటున 18.13 టీఎంసీలకు పెరిగిందని చెప్పారు. ఇది 89 శాతం అధికం. అక్టోబర్ నాటికి దేవాదుల ద్వారా 16.71 టీఎంసీలు, సీతారామ ద్వారా 8.10 టీఎంసీలు కలిపి మొత్తం 24.81 టీఎంసీల గోదావరి జలాలను వినియోగించినట్లు వెల్లడించారు. దీంతో ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఆయకట్టుకు సాగునీరు, తాగునీరు అందించామని వివరించారు.

**రూ.4,193 కోట్లతో రెండు దశల్లో పనులు!**

మూడు బ్యారేజీల పునరుద్ధరణను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సీఎం ఆదేశించారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని తిరిగి తీసుకురావడంతో పాటు రక్షణ పనులను రెండు దశల్లో చేపట్టాలని సూచించారు. నిర్మాణ లోపాలకు సంబంధించిన మరమ్మతుల ఖర్చును సంబంధిత నిర్మాణ సంస్థలే భరించేలా, అదనపు పనుల వ్యయాన్ని ప్రభుత్వం భరించేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. గత ప్రభుత్వం మేడిగడ్డ నిర్మాణంలో చేసిన తప్పుల వల్లే బ్యారేజీ కుంగిపోయిందని సీఎం పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ప్రాణహిత ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే తక్కువ ఖర్చుతో ఎల్లంపల్లికి నీటిని తరలించే అవకాశం ఉండేదని అభిప్రాయపడ్డారు. కొత్త ప్రభుత్వం వచ్చాక వ్యవసాయ విస్తీర్ణం పెరిగిందని, వరి దిగుబడిలో దేశంలో రికార్డు సాధించామని గుర్తుచేశారు. బ్యారేజీల భద్రత, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, కేంద్ర సంస్థలు, నిర్మాణ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, కల్నల్ పరీక్షిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# చెన్నైలో పెళ్లి వేడుక.. ప్రముఖుల కలయిక

■ **జగన్, విజయ్, కేటీఆర్ హాజరు**

ఒకే కుటుంబ వేడుకలు..వేర్వేరు రాజకీయ భేటీలు! తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల వైఎస్ షర్మిల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తన కుమారుడి వివాహానికి ఆహ్వానించారు. ఈ భేటీ రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. తాజాగా వైఎస్ జగన్ సోదరుడు వైఎస్ అనిల్‌రెడ్డి వివాహ వేడుకలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సందడి చేశారు. ఇలా ఒకవైపు షర్మిల రేవంత్‌రెడ్డిని కలవడం, మరోవైపు జగన్ కుటుంబ వేడుకలో కేటీఆర్ కనిపించడం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. ఈ రెండు పరిణామాలను రాజకీయ పరిశీలకులు ప్రత్యేకంగా గమనిస్తున్నారు.

**ఒకే వేదికపై ప్రముఖుల సందడి..**

అనిల్‌రెడ్డి వివాహ వేడుకకు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ హాజరుకావడం మరో విశేషం. ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ కూడా ఈ వేడుకలో కనిపించినట్లు సమాచారం. రాజకీయ, సినీ, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులు ఒకే వేడుకలో కలవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా జగన్ కుటుంబ వేడుకలో కేటీఆర్ పాల్గొనడం రాజకీయ చర్చలకు కొత్త కోణం ఇచ్చింది. షర్మిల రేవంత్‌రెడ్డిని ఆహ్వానించిన పరిణామానికి, జగన్ కుటుంబ వేడుకలో కేటీఆర్ హాజరైన అంశానికి మధ్య రాజకీయ వర్గాలు ఆసక్తికరమైన పోలికలు చూస్తున్నాయి. అయితే ఈ హాజరును రాజకీయ సంకేతంగా భావించాలా, కేవలం కుటుంబ వేడుకకు పరిమితమైన విషయంగానే చూడాలా అన్నది చర్చనీయాంశంగా మారింది.





# మెగా ఇంట్లో పెళ్లి సందడి

## ఘనంగా సాయి దుర్గా తేజ్ నిశ్చితార్థం!

మెగా కుటుంబంలో మరో శుభవార్త! చిరంజీవి మేనల్లుడు, యువ కథానాయకుడు సాయి దుర్గా తేజ్ త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నాడు. ఆయన నిశ్చితార్థ వేడుక కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఘనంగా జరిగినట్లు సమాచారం. ఈ వేడుకతో మెగా కుటుంబంలో పెళ్లి సందడి మొదలైంది. కొంతకాలంగా సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్న సాయి దుర్గా తేజ్ ఇప్పుడు వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయానికి సిద్ధమవుతున్నాడు. నిశ్చితార్థ వార్తతో మెగా అభిమానుల్లో ఆనందం నెలకొంది. తమ అభిమాన నటుడు త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతుండటంతో సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. కాబోయే జీవిత భాగస్వామి వివరాలు, వివాహ తేదీ వంటి అంశాలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

## అరెస్ట్ అంటే అదుపులోకి

# తీసుకున్నక్షణమే!

■ **24 గంటల నిబంధనపై సుప్రీంకోర్టు సంచలనం**

పోలీసుల అదుపులోకి వచ్చిన క్షణం నుంచే 24 గంటల గడువు ప్రారంభమవుతుందని సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. నిందితుడి శరీరాన్ని తాకి, అతడి స్వేచ్ఛను నిరోధించిన క్షణమే దానిని అరెస్ట్‌గా పరిగణించాలని స్పష్టం చేసింది. అధికారికంగా అరెస్ట్ నమోదు చేసిన సమయం నుంచి కాకుండా, తొలిసారి అదుపులోకి తీసుకున్న సమయం నుంచే న్యాయమూర్తి ముందు హాజరుపరిచే గడువు లెక్కించాలని తేల్చిచెప్పింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం కీలక తీర్పు ఇచ్చింది. ఇప్పటివరకు పోలీసులు విచారణ, సోదాలు, స్వాధీన ప్రక్రియల పేరుతో వ్యక్తులను ముందుగానే అదుపులో ఉంచి, ఆ తర్వాత అధికారిక అరెస్ట్ నమోదు చేస్తున్నారని కోర్టు గుర్తించింది. ఈ విధానం వల్ల అక్రమ నిర్బంధం, చిత్రహింసలు, బలవంతపు వాంగ్మూలాల సేకరణకు అవకాశం ఏర్పడుతోందని తీవ్రంగా వ్యాఖ్యానించింది.



**హక్కులకు చట్టాల మినహాయింపు లేదు**

రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(2) ప్రకారం అరెస్టయిన వ్యక్తిని 24 గంటల్లోగా న్యాయమూర్తి ముందు హాజరుపరచాలి. ఈ గడువు వ్యక్తి స్వేచ్ఛను కోల్పోయిన సమయం నుంచే ప్రారంభమవుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది. అరెస్ట్, నిర్బంధం మధ్య తేడా చూపిస్తూ ప్రత్యేక సమయాన్ని సృష్టించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ కల్పించే ఆర్టికల్ 21 హక్కులను ఏ ప్రభుత్వ యంత్రాంగం కూడా తేలిగ్గా తీసుకోరాదని స్పష్టం చేసింది. యూఏపీఏ, పీఎంఎల్ఏ, ఎన్డీపీఎస్ వంటి ప్రత్యేక చట్టాల కింద కూడా ఈ ప్రాథమిక హక్కులను కాలరాయడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. అరెస్ట్ చేసిన ప్రదేశం నుంచి న్యాయమూర్తి ఎదుటకు తీసుకెళ్లేందుకు పట్టే ప్రయాణ సమయం మినహా, మిగిలిన సమయమంతా 24 గంటల గడువులోనే లెక్కించాలని ఆదేశించింది.

**అక్రమ నిర్బంధం తేలితే తక్షణ విడుదల!**

24 గంటలకు మించి నిర్బంధంలో ఉంచిన వ్యక్తిని న్యాయమూర్తి ముందు హాజరుపరిస్తే వెంటనే విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నిర్బంధ సమయం వాస్తవ పరిస్థితులకు మించి అసమంజసంగా ఉన్నప్పటికీ, 24 గంటలు పూర్తికాకపోయినా విడుదల చేసే అధికారం న్యాయమూర్తులకు కల్పించింది. నిర్బంధానికి సంబంధించిన అసలు తేదీ, సమయాన్ని న్యాయమూర్తి తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టం చేసింది. నార్కోటిక్స్ కేసులో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్న 18 గంటల తర్వాత అధికారికంగా అరెస్ట్ చేసిన వ్యవహారంపై విచారణ సందర్భంగా ఈ తీర్పు వెలువడింది. త్రిపుర హైకోర్టు బెయిల్ నిరాకరించినప్పటికీ, సుప్రీంకోర్టు నలుగురినీ తక్షణమే విడుదల చేయాలని ఆదేశించింది. పోలీసుల విచారణాధికారానికి హద్దులు విధిస్తూ, పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు రాజ్యాంగమే కవచమని ఈ తీర్పు మరోసారి చాటిచెప్పింది.

# దూసుకెళ్లిన స్టాక్ మార్కెట్

■ **ఆరు రోజుల్లో 8 శాతం లాభాలు**

■ **₹ 29 లక్షల కోట్ల సంపద సృష్టి!**

■ **విదేశీ పెట్టుబడుల రాకతో కొత్త జోష్**



సెన్సెక్స్, నిఫ్టీలకు భారీ లాభాలు.. దేశీయ స్టాక్ మార్కెట్లు ఏడు నెలల గరిష్ఠస్థాయిలో ఒక్కరోజు ర్యాలీని నమోదు చేశాయి. వరుసగా ఆరు ట్రేడింగ్ సెషన్లుగా సాగుతున్న లాభాలతో ఇన్వెస్టర్ల సంపద సుమారు రూ.29 లక్షల కోట్లు పెరిగింది. గురువారం సెన్సెక్స్ ఏకంగా 2,008.61 పాయింట్లు, 2.60 శాతం లాభంతో 79,310.01 వద్ద ముగిసింది. నిఫ్టీ 576 పాయింట్లు, 2.40 శాతం పెరిగి 24,536.60కు చేరింది. గత ఆరు సెషన్లలో సెన్సెక్స్ 8.27 శాతం, నిఫ్టీ 8 శాతం చొప్పున పుంజుకున్నాయి. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల తర్వాత అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుతాయనే అంచనాలు, ముడిచమురు ధరల పతనం మార్కెట్లకు ఊతమిచ్చాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) తిరిగి భారత మార్కెట్లలో కొనుగోళ్లు ప్రారంభించడం కూడా ర్యాలీకి ప్రధాన కారణమైంది. అయితే 2026లో ఇప్పటివరకు సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా 6.9 శాతం, 6.1 శాతం నష్టాల్లోనే ఉండటం గమనార్హం.

**పన్నురాయితీల ఆశలు..విదేశీ నిధుల ప్రవాహం**

దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ)పై రాయితీలు లభించవచ్చనే అంచనాలు పెట్టుబడిదారుల్లో ఉత్సాహాన్ని పెంచాయి. విదేశీ పెట్టుబడిదారులకు ఈ పన్నును తొలగించాలని సెబీ ప్రభుత్వానికి సూచించగా, అన్ని వర్గాల పెట్టుబడిదారులకూ రద్దు చేయాలని ఎస్‌బీఐ రీసెర్చ్ అభిప్రాయపడింది. అక్టోబర్ 16 నుంచి 13 ట్రేడింగ్ సెషన్లలో ఎఫ్ఐఐలు రూ.39,404 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. మరోవైపు బ్రెంట్ ముడిచమురు ధరలు దాదాపు 10 శాతం తగ్గి బ్యారెల్‌కు 94 డాలర్లకు చేరడం భారత్‌కు ఊరటనిచ్చింది. కంపెనీల రెండో త్రైమాసిక లాభాలు మెరుగుపడటం, మార్కెట్ విలువలు ఆకర్షణీయంగా మారడం కూడా విదేశీ పెట్టుబడులకు అనుకూలంగా ఉన్నాయి. ముఖ్యంగా 134 కంపెనీల లాభాలు గత ఏడాదితో పోలిస్తే 34 శాతం పెరిగినట్లు నోమురా విశ్లేషించింది.

**ర్యాలీ కొనసాగుతుందా.. నిపుణుల అంచనాలు**

ముడిచమురు ధరలు 100 డాలర్ల దిగువన కొనసాగడం, అమెరికా బాండ్ రాబడులు తగ్గడం, విదేశీ నిధుల రాక కొనసాగితే మార్కెట్ మరింత పుంజుకోవచ్చని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ విశ్లేషకుడు వత్సల్ భువా అభిప్రాయపడ్డారు. వచ్చే 12 నెలల్లో నిఫ్టీ 27,000-28,000 స్థాయికి, సెన్సెక్స్ 87,000-90,000 స్థాయికి చేరే అవకాశం ఉందని అంచనా వేశారు. కార్పొరేట్ లాభాలు, జీఎస్టీ వసూళ్లు, వాహన విక్రయాలు, విద్యుత్ వినియోగం, రుణ వృద్ధి వంటి అంశాలు కూడా మార్కెట్‌కు బలాన్నిస్తున్నాయని ఆనంద్ రాఠీ అడ్వైజర్స్ ఫండ్ మేనేజర్ మయూర్ షా పేర్కొన్నారు. అయితే ఈ ర్యాలీ దీర్ఘకాలం కొనసాగుతుందని ఇప్పుడే నిర్ధారించలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముడిచమురు ధరలు మళ్లీ పెరగడం, అంతర్జాతీయ బాండ్ రాబడులు అధికమవడం, భౌగోళిక ఉద్రిక్తతలు, సాంకేతిక రంగంలో పెట్టుబడులపై అనిశ్చితి మార్కెట్లకు ప్రతికూలంగా మారవచ్చని నోమురా సూచించింది. లాభాల స్వీకరణ కూడా పెరిగే అవకాశముందని జియోజిత్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ హెచ్చరించారు.

# ప్రళయ్ క్షిపణి పరీక్ష సక్సెస్

■ **స్వదేశీ రక్షణ శక్తికి మరో పదును**

■ **హైదరాబాద్‌లో రూపకల్పన**

శత్రువులకు సవాల్.. భారత అమ్ములపొదిలోకి మరో అత్యాధునిక అస్త్రం! దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా భారత్ మరో కీలక విజయం సాధించింది. రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'ప్రళయ్' క్వాసీ బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. గురువారం ఉదయం 11.10 గంటలకు ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ఈ ప్రయోగం నిర్వహించారు. సైన్యంలో ప్రవేశపెట్టే ముందు చేపట్టిన వినియోగదారుల మూల్యాంకన పరీక్షల్లో భాగంగా ఈ ప్రయోగం జరిగింది. క్షిపణికి నిర్దేశించిన అన్ని లక్ష్యాలు విజయవంతంగా పూర్తయ్యాయని రక్షణ శాఖ ప్రకటించింది. చండీపూర్‌లోని సమగ్ర పరీక్షా కేంద్రం (ఐటీఆర్) ఏర్పాటు చేసిన వివిధ రేంజ్ పరికరాల ద్వారా సేకరించిన సమాచారం పరీక్ష విజయాన్ని ధ్రువీకరించింది. ఈ విజయంతో ప్రళయ్ క్షిపణిని భారత సాయుధ దళాల్లో ప్రవేశపెట్టేందుకు మార్గం సుగమమైంది.

**హైదరాబాద్‌లో రూపకల్పన.. స్వదేశీ తయారీ!**

ప్రళయ్ క్షిపణిని హైదరాబాద్‌లోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ), డీఆర్‌డీఓకు చెందిన ఇతర ప్రయోగశాలలు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. అభివృద్ధి, ఉత్పత్తి భాగస్వాములో ఒకటైన భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) ఈ క్షిపణి వ్యవస్థను తయారు చేసింది. ప్రయోగాన్ని డీఆర్‌డీఓ ఉన్నతాధికారులు, సైనిక దళాల ప్రతినిధులు, రక్షణ రంగ పరిశ్రమల ప్రతినిధులు ప్రత్యక్షంగా పరిశీలించారు. వినియోగదారుల మూల్యాంకన ప్రక్రియలో భాగంగా ఈ పరీక్ష నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పరీక్షలో అన్ని నిర్దేశిత లక్ష్యాలు చేరుకోవడంతో సైన్యంలోకి ప్రళయ్ ప్రవేశం మరింత దగ్గరైంది. పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో రూపొందిన ఈ క్షిపణి భారత రక్షణ రంగంలో దేశీయ తయారీ సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది.



**సైనిక పాటవానికి మరింత బలం!**


ప్రళయ్ విజయవంతమైన ప్రయోగంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు, సాయుధ దళాలు, పరిశ్రమల భాగస్వాములను అభినందించారు. అత్యాధునిక సాంకేతికతతో రూపొందిన ఈ క్షిపణి వల్ల భారత సైన్యం సాంకేతిక సామర్థ్యం మరింత పెరుగుతుందని, మారుతున్న ముప్పులను ఎదుర్కొనేందుకు సైనిక దళాల సంసిద్ధత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. రక్షణ శాఖ కార్యదర్శి, డీఆర్‌డీఓ చైర్మన్ రాజేశ్ కుమార్ సింగ్ కూడా ఈ విజయానికి కృషిచేసిన బృందాలను అభినందించారు. స్వదేశీ పరిజ్ఞానం.. అత్యాధునిక సాంకేతికత.. విజయవంతమైన పరీక్ష వెరసి భారత రక్షణ వ్యవస్థకు ప్రళయ్ మరో కీలక ఆయుధంగా మారనుంది. దేశ భద్రతకు అవసరమైన క్షిపణి సాంకేతికతలో స్వయం సమృద్ధి సాధించే లక్ష్యానికి ఈ విజయం మరింత ఊతమివ్వనుంది.

## మంత్రికి, ఎమ్మెల్యేకు టీపీసీసీ

# చీఫ్ పిలుపు బేఖాతర్!

■ **గాంధీభవన్ సమావేశానికి ఇద్దరు నేతలు దూరం**

■ **వివాదానికి తెరదించాలన్న ప్రయత్నానికి బ్రేక్**



తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మధ్య నెలకొన్న వివాదం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్‌కుమార్ గౌడ్ గురువారం గాంధీభవన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. నవంబర్ 1న ఢిల్లీలోని షాంగ్రిలా హోటల్ లాబీలో మంత్రి ఎమ్మెల్యేను దుర్భాషలాడారనే ఆరోపణలపై ఇద్దరి నుంచి వివరణ తీసుకోవాలని నిర్ణయించారు. తొలుత సమావేశానికి వస్తానని అంగీకరించిన దామోదర రాజనర్సింహా, మహేశ్‌కుమార్ గౌడ్ గాంధీభవన్‌కు చేరుకున్న తర్వాత చివరి నిమిషంలో తాను రాలేనని సమాచారం ఇచ్చారు. ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు కూడా వివిధ కారణాలు చెబుతూ సమావేశానికి దూరంగా ఉన్నారు. దీంతో ఇద్దరు నేతలతో జరగాల్సిన చర్చలు వాయిదా పడ్డాయి.

**ఇసుక వివాదమే ప్రధాన కారణమా?**

జుక్కల్ నియోజకవర్గంలో ఇసుక తవ్వకాల వ్యవహారంలో మంత్రి సూచనలను ఎమ్మెల్యే పాటించలేదనే కారణంతో దామోదర రాజనర్సింహా తీవ్రంగా స్పందించినట్లు ఆరోపణలున్నాయి. అంతేకాకుండా సంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడిగా పి. చంద్రశేఖర్‌రెడ్డి నియామకంలో ఎమ్మెల్యే ప్రమేయంపై కూడా మంత్రి అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. తన అభిరుచికి వ్యతిరేకంగా ఈ నియామకం జరిగిందని ఆయన భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామాలే ఢిల్లీలో ఇద్దరి మధ్య ఘర్షణకు దారితీసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలపై ఇరువురు నేతల వివరణ ఇంకా వెలువడలేదు.

**మరోసారి పిలిచే యోచనలో టీపీసీసీ చీఫ్**

ఇద్దరు నేతలు సమావేశానికి రాకపోవడంపై మహేశ్‌కుమార్ గౌడ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. తొలుత మంత్రితో, ఆ తర్వాత ఎమ్మెల్యేతో విడివిడిగా మాట్లాడి వివాదానికి పరిష్కారం కనుగొనాలన్నది ఆయన ఆలోచన. సమావేశం అనూహ్య కారణాలతో వాయిదా పడినట్లు గాంధీభవన్ ప్రకటించింది. ఇద్దరినీ మరోసారి సమావేశానికి ఆహ్వానించే అవకాశం ఉంది. వారి వివరణలు విన్న తర్వాతే తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని పార్టీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అంతర్గత వివాదం పరిష్కారం ఎప్పుడు అవుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

## తిరుపతి నెయ్యి కేసు..

# ఏపీలోనే విచారణ!

**బదిలీ పిటిషన్‌కు సుప్రీంకోర్టు నిరాకరణ**

తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంలో కీలక మలుపు చోటుచేసుకుంది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసు విచారణను ఆంధ్రప్రదేశ్ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. మహారాష్ట్రకు చెందిన డెయిరీ వ్యాపారి, కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన మచీంద్ర శాంతారాం లంకే తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దేవ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వాతావరణం తీవ్రంగా ఉందని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సైతం ఈ కేసుపై బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి పరిస్థితుల్లో నిష్పక్షపాత విచారణ జరగడం కష్టమని వాదిస్తూ, పొరుగున ఉన్న మరో రాష్ట్రానికి కేసును బదిలీ చేయాలని కోరారు.

**సీబీఐ దర్యాప్తుపై సుప్రీంకోర్టు విశ్వాసం!**

భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ వాదనలను పరిశీలించింది. కేసు దర్యాప్తు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ ఆధ్వర్యంలో జరుగుతోందని, రాష్ట్రంలోని రాజకీయ వ్యాఖ్యలు ఆ సంస్థ దర్యాప్తును ప్రభావితం చేయలేవని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి స్పష్టం చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ, ఇప్పటికే తమ ఆదేశాలతో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చామని, భవిష్యత్తులో ఏదైనా సమస్య ఎదురైతే మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని వ్యాఖ్యానించారు. దీంతో విచారణను మరో రాష్ట్రానికి తరలించాలన్న అభ్యర్థనకు ధర్మాసనం అంగీకరించలేదు. కేసు విచారణ ఆంధ్రప్రదేశ్‌లోనే కొనసాగనుంది.



**రూ.250 కోట్ల కుంభకోణం..**

**68 లక్షల కిలోల కల్తీ నెయ్యి!**

2019 నుంచి 2024 మధ్య తిరుమల తిరుపతి దేవస్థానాలకు సుమారు 68 లక్షల కిలోల నకిలీ, సింథటిక్ నెయ్యి సరఫరా చేసినట్లు సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తులో వెల్లడైంది. ఈ వ్యవహారంలో సుమారు రూ.250 కోట్ల కుంభకోణం జరిగినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. భక్తులకు అత్యంత పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. ఇప్పటికే ఈ కేసులో సీబీఐ దర్యాప్తు కొనసాగుతుండగా, ఈడీ కూడా ఆర్థిక లావాదేవీలపై విచారణ చేపట్టింది. తాజాగా కేసు బదిలీ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో న్యాయపోరాటం మరింత కీలక దశకు చేరుకుంది.

# రాష్ట్రాలకు కేంద్రం భారీ నిధులు

■ **పండుగ వేళ లక్ష కోట్లు విడుదల**

రాష్ట్రాల ఖజానాలకు కేంద్రం భారీ ఊరట కల్పించింది. పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పన్నుల వాటాలో నెలవారీ నిధులను ముందుగానే విడుదల చేసింది. సాధారణంగా ప్రతి నెల 10వ తేదీన విడుదల చేసే నిధులను ఈసారి ఐదు రోజుల ముందుగానే, నవంబర్ 5న రాష్ట్రాల ఖాతాల్లో జమ చేసింది. మొత్తం రూ.1,09,019 కోట్లను గురువారం విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. పండుగల సమయంలో రాష్ట్రాలకు అదనపు ఆర్థిక వెసులుబాటు కల్పించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత లేకుండా చూడటమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని వెల్లడించింది. ఈ ముందస్తు విడుదలతో రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేసే అవకాశం లభించనుంది.

**అభివృద్ధి, సంక్షేమానికి ఆర్థిక చేయూత!**

కేంద్రం విడుదల చేసిన నిధులను రాష్ట్రాలు తమ అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవచ్చని ఆర్థిక శాఖ తెలిపింది. ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడి వ్యయం, అభివృద్ధి ప్రాజెక్టుల అమలు, సంక్షేమ పథకాల నిర్వహణకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయి. పండుగల నేపథ్యంలో ప్రభుత్వ ఖర్చులు పెరిగే సమయంలో ముందస్తుగా నిధులు అందించడం వల్ల రాష్ట్రాలకు నగదు లభ్యత మెరుగుపడుతుంది. పెండింగ్ పనులు, కొత్త అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థికంగా వెసులుబాటు కల్పించడమే ఈ నిర్ణయంలోని ప్రధాన



లక్ష్యం. కేంద్రం విడుదల చేసిన మొత్తాన్ని రాష్ట్రాలు తమ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఖర్చు చేసే అవకాశం ఉంటుంది.

**కేంద్ర పన్నుల్లో 41 శాతం వాటా!**

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న పన్నుల్లో 41 శాతాన్ని రాష్ట్రాలకు పంపిణీ చేస్తోంది. ఆర్థిక సంవత్సరంలో మొత్తం 14 విడతలుగా ఈ నిధులను విడుదల చేస్తోంది. ఇందులో భాగంగానే నవంబర్ నెలకు సంబంధించిన సాధారణ విడతను ముందస్తుగా అందించింది. సాధారణంగా నవంబర్ 10న రావాల్సిన నిధులు ఐదో తేదీనే విడుదల కావడంతో రాష్ట్ర ప్రభుత్వాలకు అదనపు సమయం లభించింది. రూ.1.09 లక్షల కోట్ల భారీ నిధుల విడుదలతో రాష్ట్రాల ఆర్థిక పరిస్థితికి తాత్కాలికంగా ఊరట లభించనుంది. పండుగల ఖర్చులతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార పదా నికి ఈ నిధు

# పల్లెల్లో మళ్లీ ఫ్యాక్షన్ మంటలు!



**రాజకీయ కక్షలు, రాళ్ల దాడులు**
**బాంబుల మోతతో విధ్వంసం**
**పోలీసు పహారాకు**
**పల్లె పోరు సవాల్!**
**ఎన్నికల పోరు..**
**పాత ఫ్యాక్షన్ ఛాయలు**

## పులివెందులలో పాత పగల ప్రతాపం!

ఒకప్పుడు రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాలు గ్రామీణ జీవితాన్ని భయాందోళనలకు గురిచేశాయి. కుటుంబాల మధ్య తరతరాల కక్షలు, గ్రామాల మధ్య ఆధిపత్య పోరు, రాజకీయ ప్రత్యర్థులపై ప్రతీకార దాడులు సీమ చరిత్రలో చీకటి అధ్యాయాలుగా నిలిచాయి. కాలక్రమంలో విద్య, ఉపాధి, సామాజిక చైతన్యం పెరగడంతో ఆ సంస్కృతి తగ్గుముఖం పట్టిందనే అభిప్రాయం ఏర్పడింది. కానీ కడప జిల్లాలో తాజాగా చోటుచేసుకుంటున్న ఎన్నికల హింస మళ్లీ ఆందోళన కలిగిస్తోంది. నాటు బాంబుల స్థానంలో పెట్రోల్ బాంబులు, కత్తుల స్థానంలో కర్రలు, రాళ్లు, సీసాలతో దాడులు జరుగుతున్నాయనే ఆరోపణలు తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా నవంబర్ 5న జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పులివెందుల నియోజకవర్గంలోని పలు గ్రామాలు ఉద్రిక్తతలకు వేదికయ్యాయి. ఎర్రిపల్లెలో పెట్రోల్ బాంబుల విసుర్లు, రాళ్ల దాడులతో పోలింగ్ కేంద్రం వద్ద భయానక పరిస్థితులు ఏర్పడ్డాయి. ఓటు వేయడానికి వచ్చిన ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీయాల్సి వచ్చింది. వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారని, అక్కడున్న టీడీపీ శ్రేణులతో వాగ్వాదం జరిగిందని సమాచారం. ఆ తర్వాత ఘర్షణ రాళ్ల దాడులు, పెట్రోల్ బాంబుల విసుర్ల వరకు వెళ్లింది. పోలీసులు అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. మరోవైపు ఆర్.తుమ్మలపల్లిలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య రాళ్లు, సీసాలతో దాడులు జరిగాయని, ఈ ఘటనలో వైసీపీ కార్యకర్త కృష్ణారెడ్డి తీవ్రంగా గాయపడ్డారని సమాచారం. ఈ ఘటనలు సాధారణ రాజకీయ వాగ్వాదాలు కావు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే హింసాత్మక పరిణామాలు. ఒక గ్రామంలో రాజకీయ ఘర్షణ మొదలైతే అది పోలింగ్ రోజుతో ముగిసిపోదు. బాధితుల కుటుంబాలు, ప్రత్యర్థి వర్గాల మధ్య కొత్త కక్షలకు దారితీసే ప్రమాదం ఉంది. అందుకే ఎన్నికల పోటీ వ్యక్తిగత ప్రతీకారంగా మారకుండా అడ్డుకోవడం ఇప్పుడు అత్యవసరం.



**పోలింగ్ కేంద్రాల వద్ద వివాదాలు..**
**పోలీసులపై ఆరోపణలు**

లింగాల మండలం పార్నపల్లెలో పోలింగ్ ఏజెంట్ల అనుమతి వ్యవహారం వివాదానికి దారితీసింది. తమ పార్టీ ఏజెంట్లను కేంద్రంలోకి అనుమతించడం లేదంటూ వైసీపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకుని అక్కడికి వెళ్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని పోలీసులు మార్గమధ్యంలో అడ్డుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. బయట ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు వాహనాల్లో తిరుగుతూ తమ ఏజెంట్లను అడ్డుకుంటున్నారని, పోలీసుల సమక్షంలోనే పార్టీ నాయకులను అరెస్టు చేస్తున్నారని అవినాష్‌రెడ్డి ఆరోపించారు. పెద్దముడియం మండలం గుండ్లకుంటలో వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, టీడీపీ శ్రేణుల మధ్యతోపులాట జరిగింది. రెండు పోలింగ్ కేంద్రాల నుంచి టీడీపీ ఏజెంట్లను బయటకు పంపించారనే ఆరోపణలతో పోలీసులు జోక్యం చేసుకుని వారిని తిరిగి లోపలికి పంపించారు. నందలూరు మండలంలో బయటి ప్రాంతాల నుంచి జీపులు, కార్లలో పెద్ద సంఖ్యలో వ్యక్తులు రావడంతో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ పరిణామాలన్నీ ఎన్నికల నిర్వహణలో భద్రత, ఏజెంట్ల హక్కులు, ఓటర్ల స్వేచ్ఛ ఎంత కీలకమో స్పష్టం చేస్తున్నాయి. గత నవంబర్ 1న పులివెందుల మున్సిపల్ పోలింగ్ సమయంలోనూ ఇలాంటి ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. 80 పోలింగ్ కేంద్రాల్లో 70 చోట్ల వైసీపీ ఏజెంట్లను అనుమతించలేదని ఆరోపణలు వచ్చాయి. రాళ్ల దాడుల్లో మూడు కార్లు, పది బైకులు, ఒక ట్రాక్టర్ దెబ్బతిన్నట్లు సమాచారం. వీడియో జర్నలిస్టు విజయ్‌పై దాడి చేసి కెమెరాను ధ్వంసం చేయడంతో పాటు మెమరీ కార్డు, బ్యాటరీ లాక్కున్నారనే ఆరోపణలు కూడా వెలువడ్డాయి. కడప కార్పొరేషన్‌లోని 15/2 వార్డుతో పాటు జమ్మలమడుగులోని మూడు పోలింగ్ కేంద్రాల్లో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో రీపోలింగ్ నిర్వహించాల్సి వచ్చింది. అక్టోబర్ 17న పులివెందులలో నామినేషన్ల సందర్భంగా ఆరు రౌండ్ల గాల్లో కాల్పులు, టియర్ గ్యాస్, లాఠీచార్జి వరకు పరిస్థితి వెళ్లింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 హింసాత్మక ఘటనలు, 275 ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు పోలీసు వర్గాల సమాచారం కూడా పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. అయితే ఆయా ఘటనల్లో ఎవరి పాత్ర ఎంత ఉందనేది విచారణలో తేలాల్సి ఉంది. పోలీసులపై పక్షపాత ఆరోపణలు వచ్చినా, పోలింగ్ ఏజెంట్ల హక్కులకు భంగం కలిగినా వాటిపై పారదర్శకంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. ఓటరు స్వేచ్ఛగా కేంద్రానికి వెళ్లి ఓటు వేసి తిరిగి ఇంటికి చేరగలగాలి. అదే ప్రజాస్వామ్య ఎన్నికల కనీస ప్రమాణం.

### గ్రామాల మధ్య చిచ్చు వద్దు

పులివెందుల నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాల వెనుక పాత రాజకీయ ఆధిపత్యం, కొత్త సమీకరణాలు, స్థానిక వర్గపోరు పరస్పరం ముడిపడి ఉన్నాయనే చర్చ సాగుతోంది. దశాబ్దాలుగా వైఎస్ కుటుంబానికి బలమైన రాజకీయ స్థావరంగా ఉన్న ఈ ప్రాంతంలో టీడీపీ తన ఉనికిని విస్తరించేందుకు ప్రయత్నించడం సహజ రాజకీయ పరిణామమే. ప్రజల మద్దతుతో ప్రత్యర్థి పార్టీ ఎదగడం ప్రజాస్వామ్యానికి మంచిదే. కానీ ఆ పోటీ భయపెట్టడం, దాడులు చేయడం, ఓటర్లను అడ్డుకోవడం వంటి చర్యలకు దారితీయకూడదు. ఒకప్పుడు తగ్గుముఖం పట్టిన ఫ్యాక్షన్ ధోరణులు ఎన్నికల పేరుతో మళ్లీ బయటపడితే దాని ప్రభావం రాజకీయ పార్టీలకే పరిమితం కాదు. ఒకే గ్రామంలో నివసించే కుటుంబాలు రెండు వర్గాలుగా విడిపోయే ప్రమాదం ఉంది. శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలు, రోజువారీ సంబంధాలు కూడా రాజకీయ రంగు పులుముకునే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో కడప ఎస్పీ ఎస్. నచికేత్ విశ్వనాథ్ సమస్యాత్మక గ్రామాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామని, సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా ఉంచుతామని, హింసకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించినట్లు సమాచారం. అయితే బలగాల మోహరింపు ఒక్కటే సరిపోదు. పోలీసుల నిష్పాక్షికత, ముందస్తు నిఘా, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై సమాన చర్యలు అత్యంత అవసరం. పెట్రోల్ బాంబులు విసిరినవారు, రాళ్ల దాడులకు పాల్పడినవారు, జర్నలిస్టులపై దాడి చేసినవారు ఎవరైనా చట్టం ముందు నిలబడాలి. రాజకీయ నాయకులు కూడా తమ కార్యకర్తలకు సంయమనం పాటించాలని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. ప్రత్యర్థి పార్టీకి చెందిన వ్యక్తికీ ఓటు హక్కు ఉందనే విషయాన్ని గుర్తించాలి. ఎన్నికల్లో గెలవడం కోసం గ్రామాల మధ్య శాశ్వత శత్రుత్వాన్ని సృష్టించడం వల్ల చివరకు నష్టపోయేది సామాన్య ప్రజలే. అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడే రాజకీయ పార్టీలు గ్రామాల్లో శాంతిని కాపాడటానికి అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. సీమ పౌరుషం అంటే ప్రత్యర్థిపై దాడి చేయడం కాదు.. ప్రజల సమస్యల కోసం నిలబడటం. ప్రజాస్వామ్యంలో బలప్రదర్శన జరగాల్సింది ఓట్ల ద్వారా మాత్రమే. పెట్రోల్ బాంబులతో కాదు. ఎన్నికల్లో ఎవరు గెలిచినా గ్రామంలో శాంతి గెలవాలి. రాజకీయ కక్షలు ఓడిపోవాలి. పల్లెల్లో మళ్లీ ఫ్యాక్షన్ సంస్కృతికి చోటు లేకుండా పోలీసు వ్యవస్థ, రాజకీయ నాయకత్వం బాధ్యతగా వ్యవహరించాలి.

## వేంపల్లిలో ప్రశాంతంగా జడ్పీటీసీ పోలింగ్

వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లి మండలంలో గురువారం జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. ట్రాన్స్ జెండర్లు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలువురు రాజకీయ ప్రముఖులు కూడా ఓటేశారు. ఏపీసీసీ మీడియా చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి ఓటు వేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగారెడ్డి సతీష్ కుమార్ రెడ్డి 28వ బూత్ లో, టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి హరిజనవాడలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆప్ నేతలు రహమతుల్లా, దాదా పీర్ కూడా ఓటేశారు.





## లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్య ప్రభుత్వ హత్యే!

**కుటుంబానికి కోటి పరిహారం ఇవ్వాలి**
**భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి**
**బీసీఐఎఫ్ చైర్మన్ చిరంజీవులు డిమాండ్**

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్యపై బీసీ సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం (బీసీఐఎఫ్) హైదరాబాద్ చైర్మన్ టీ. చిరంజీవులు ఆధ్వర్యంలో పలువురు నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్య ప్రభుత్వ వైఫల్యానికి, పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని, ఇది ప్రభుత్వమే చేసిన హత్యగా భావించాల్సి వస్తోందని విమర్శించారు. తెలంగాణ కోసం 1,200 మందికి పైగా యువకులు ప్రాణత్యాగం చేశారని, రాష్ట్రం ఏర్పడితే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆశించారని గుర్తుచేశారు. కానీ ఉద్యమకారుల కుటుంబాలకే న్యాయం జరగని పరిస్థితి ఏర్పడిందన్నారు. గత 12 ఏళ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమ నిధులను పక్కదారి పట్టిస్తూ, ప్రజలకు నేరుగా ప్రయోజనం కలిగించని ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు.

**కలెక్టర్ వ్యవహారంపై విచారణకు డిమాండ్**

రాజకీయ పార్టీలకు బాధ్యత: జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వ్యవహారశైలిపై కూడా చిరంజీవులు అభ్యంతరం వ్యక్తం చేశారు. లేని భూ వివాదాలను సృష్టించి లక్ష్మణ్ గౌడ్‌ను మానసిక ఒత్తిడికి గురిచేశారన్న కుటుంబ సభ్యుల ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, ఉద్యమకారులకు అందించే అన్ని సంక్షేమ ప్రయోజనాలను ఈ కుటుంబానికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్ కూడా బాధ్యత వహించాలని బీసీ ఉద్యమ నేత వట్టే జానయ్య కోరారు. 2006 నుంచి లక్ష్మణ్ గౌడ్ బీఆర్ఎస్ కార్యకర్తగా కొనసాగినందున ఆ పార్టీ తన ఆర్థిక వనరుల నుంచి మరో రూ.కోటి ఆర్థిక సాయం అందించాలని చిరంజీవులు డిమాండ్ చేశారు. బీసీ నాయకులు వట్టే జానయ్య, బైరి శేఖర్ గౌడ్, రాఘవేందర్ గౌడ్, చెన్నా శ్రీకాంత్ తదితరులు కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు. న్యాయం జరిగే వరకు పోరాడతామని, ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉద్యమకారుడి కుటుంబానికి న్యాయం చేయాలన్న డిమాండ్‌తో జరిగిన ఈ పరామర్శలో బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం సభ్యులు అవ్వారు వేణు, మామిళ్ల లింగేశ్ యాదవ్, కొండల్ గౌడ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## బీసీల ఆత్మగౌరవానికి 88.50 కోట్లు!

**38 కుల సంఘాల భవనాలకు నిధులు మంజూరు**

బీసీల ఆత్మగౌరవానికి కొత్త చిరునామాలు.. సామాజిక అభివృద్ధికి శాశ్వత వేదికలు! రాష్ట్రంలోని 38 బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.88.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు (జీవోలు) జారీ చేసింది. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కుల సంఘాల ప్రతినిధులకు జీవో పత్రాలను అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు నిర్మాణాలను వేగవంతం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో స్థలాలు కేటాయించినప్పటికీ పరిపాలనా, సాంకేతిక సమస్యలతో పనులు ప్రారంభం కాలేదని, హెచ్ఎండీఏ సహకారంతో వాటిని పరిష్కరించి నిర్మాణాలకు అనువుగా లేఅవుట్లు సిద్ధం చేశామని వివరించారు. కార్తీక మాసంలోనే శంకుస్థాపనలు చేసి, ఏడాదిలోగా భవన నిర్మాణాలు పూర్తి చేయాలని కుల సంఘాల ప్రతినిధులకు సూచించారు. అవసరమైన అనుమతులను సింగిల్ విండో విధానంలో త్వరగా మంజూరు చేస్తామని, ప్రతి నెలా నిర్మాణాల పురోగతిని సమీక్షిస్తామని స్పష్టం చేశారు. బీసీలకు కేటాయించిన భూములను ఏ ప్రభుత్వం కూడా వెనక్కి తీసుకునే పరిస్థితి లేదని, అవి బలమైన వర్గాల ఆస్తులని భరోసా ఇచ్చారు.

**విద్య, ఉపాధి, సామాజిక ఐక్యతకు కేంద్రాలు!**

నిర్మాణాలు నిర్దేశిత గడువులో పూర్తి చేయాల్సిన బాధ్యత కుల సంఘాలపైనా ఉందని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. భవనాలను కేవలం సమావేశాలకే పరిమితం చేయకుండా బీసీ విద్యార్థుల వసతి, నైపుణ్యాభివృద్ధి, గ్రంథాలయాలు, సామాజిక కార్యక్రమాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. ఆర్థిక స్థోమత ఉన్న సంఘాలు అదనపు సహకారం అందించాలని, అంతర్గత విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా పనులు పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు మాట్లాడుతూ అన్ని బీసీ సంఘాలు ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీసీ సంఘాల జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ 40 బీసీ కుల సంఘాలు, 36 సంచార జాతులకు చెందిన మొత్తం 76 కులాలకు బడ్జెట్ మంజూరు ఉత్తర్వులు అందించారని తెలిపారు. హైదరాబాద్ లో చదువుకునే విద్యార్థులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ఈ భవనాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అన్ని బీసీ వర్గాలు కలిసి కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు హైదరాబాద్ లో ఐదు ఎకరాల స్థలంలో సమగ్ర బీసీ భవన్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

**ఐదు ఎకరాల్లో సమగ్ర బీసీ భవన్!**

అంబర్‌పేట ఛే నంబర్ చౌరస్తా సమీపంలో, ఉస్మానియా యూనివర్సిటీ పరిసరాల్లో ఉన్న స్థలాన్ని బీసీ భవన్ నిర్మాణానికి పరిశీలించాలని హనుమంతరావు సూచించారు. అక్కడ ఇప్పటికే పూలే విగ్రహం ఉందని, ఆ స్థలం ఆక్రమణలకు గురవుతోందని పేర్కొన్నారు. గ్రంథాలయంతోపాటు రవీంద్రభారతి తరహాలో భారీ ఆడిటోరియం నిర్మిస్తే విద్యార్థులు, బలహీన వర్గాలకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు వెల్లడించారు. బీసీల అభ్యున్నతి, సామాజిక న్యాయానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని నేతలు పేర్కొన్నారు. ప్రగతి భవన్‌కు మహాత్మా జ్యోతిబా ఫూలే పేరు పెట్టడం, ఫూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ, రాష్ట్రంలో కులగణన చేపట్టడం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయ దేవి, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, బీసీ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ స్థలాల కబ్జాదారులకు హెచ్చరిక

ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రభుత్వ, మున్సిపల్ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పురపాలక సంఘం కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ హెచ్చరించారు. మున్సిపల్ ఆస్తులను గుర్తించి రక్షణ కల్పించడంతోపాటు నిరంతరం పర్యవేక్షించాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్‌ను ఆదేశించారు. బొల్లవరంలో మున్సిపల్ స్థలం ఆక్రమణకు గురైనట్లు సమాచారం రావడంతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడి అక్రమ ఆక్రమణలను వెంటనే తొలగించి, స్థలాన్ని పురపాలక సంఘం ఆధీనంలోకి తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఆస్తులు ప్రజల ఆస్తులని, భవిష్యత్ తరాల ప్రయోజనాల కోసం వాటిని కాపాడాల్సిన బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. నిర్లక్ష్యం లేకుండా ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ సిటీ కృష్ణసింగ్, టీపీవో జి.చంద్రమోహన్, టౌన్ సర్వేయర్ నాగరాజు పాల్గొన్నారు.



## పులివెందుల ఎన్నికల హింసపై బీటెక్ రవి ధ్వజం

కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా జరిగిన ఘటనలపై టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి స్పందించారు. టీడీపీపై వైఎస్ అవినాష్‌రెడ్డి చేస్తున్న రిగ్గింగ్, దౌర్జన్యాలు, పోలీసుల వేధింపుల ఆరోపణలను ఖండించారు. లింగాల మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, టీడీపీ ఏజెంట్లు హింసకు పాల్పడినట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. నల్లపురెడ్డిపల్లెలో 400-500 మంది రాళ్లు, కర్రలతో తమ ఏజెంట్లను చుట్టుముట్టి, సహాయానికి వచ్చిన రెండు వాహనాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. వేంపల్లిలో ఆరు బూత్‌లలో రిగ్గింగ్, ఎర్రబల్లిలో మహిళలపై కారం పొడి దాడులు, వేల్పులలో టపాసుల ప్రయోగం జరిగాయని, వీడియో ఆధారాలు ఉన్నాయని తెలిపారు. గత నామినేషన్ల సమయంలోనూ రాళ్ల దాడులు, ఫైరింగ్, టియర్ గ్యాస్ ఘటనలు జరిగాయని, టీడీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. ఎన్నికలు ముగిసినందున పరస్పర విమర్శలు మాని, పులివెందుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై అవినాష్‌రెడ్డి దృష్టి పెట్టాలని హితవు పలికారు.



## ప్రభుత్వ ఆసుపత్రిలోనే పరీక్షలు.. ఎమ్మెల్యే హెచ్చరిక

ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వివిధ విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. స్కానింగ్, ఎక్స్ రే వంటి పరీక్షలను ప్రభుత్వ ఆసుపత్రిలోనే నిర్వహించాలని, వైద్య పరీక్షల పేరుతో రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు పంపితే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది రోగులతో మర్యాదగా వ్యవహరించాలని, ఎవరైనా దురుసుగా ప్రవర్తించినా, డబ్బులు డిమాండ్ చేసినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బద్వేలు శ్రీనివాసులరెడ్డి, సూపరింటెండెంట్ ఆనంద్ బాబు, టీడీపీ రాజుపాలెం మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## కుటుంబంతో వచ్చి ఓటేసిన ఎమ్మెల్యే మాలకొండయ్య

వేటపాలెం మండలంలో గురువారం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య తన భార్యతోపాటు కుటుంబ సభ్యులతో కలిసి కొత్తపేట గ్రామంలోని పంచాయతీరాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాధారణ ఓటరులాగే క్యూలో వేచి ఉండి, అధికారుల తనిఖీ అనంతరం ఓటు వేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్థానిక అభివృద్ధి, గ్రామీణ పాలనకు స్థానిక సంస్థల ఎన్నికలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. మురుసు తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్న ప్పటికీ ఓటర్లు వెనుకడుగు వేయకుండా పోలింగ్ కేంద్రాలకు రావాలని పిలుపునిచ్చారు.

## ఓటు హక్కు వినియోగించిన కరణం వెంకటేష్



చీరాల మండలంలో గురువారం జరుగుతున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ కరణం వెంకటేష్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. రామకృష్ణాపురం పంచాయతీ పరిధిలోని 49వ పోలింగ్ కేంద్రానికి స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి చేరుకున్న ఆయన క్యూలో వేచి ఉండి ఓటు వేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన హక్కు అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు, మురుసు తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నా ఓటర్లు వెనుకడుగు వేయడం లేదు. రామకృష్ణాపురంతోపాటు పరిసర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.

## చీరాలలో ప్రశాంతంగా స్థానిక పోలింగ్

చీరాల మండలంలో గురువారం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ప్రారంభమైంది. వాడరేవు, గవినివారిపాలెం, రామకృష్ణాపురం, ఈపురుపాలెం, దేవినూతల, కావూరివారిపాలెం గ్రామాల్లో ఉదయం నుంచే ఓటర్లు పెద్ద సంఖ్యలో కేంద్రాలకు చేరుకున్నారు. మహిళలు, యువకులు, వృద్ధులు క్యూలైన్లలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ పారదర్శకంగా సాగేందుకు బాపట్ల జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసింది. సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచడంతోపాటు గుర్తింపు కార్డుల పరిశీలన తర్వాతే ఓటర్లను అనుమతిస్తున్నారు. మురుసు తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు.




# ట్రంప్ కి ప్రతికూల రిజల్ట్ మోదీ అవుతారా అలర్ట్

**అధికారం ఉంది.. నాయకుడికి ప్రజాదరణ ఉంది.. ప్రత్యర్థులను చీల్చే రాజకీయ వ్యూహాలున్నాయి.. అయినా ప్రజల తీర్పు ముందు ఇవేవీ శాశ్వత రక్షణ కవచాలు కావని అమెరికా ఎన్నికలు మరోసారి చాటిచెప్పాయా? రెండేళ్లకే ట్రంప్ ప్రభుత్వానికి ఎదురైన రాజకీయ ఎదురుదెబ్బ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చకు తెరలేపుతోంది. మరి ఈ అమెరికా తీర్పు మోదీకి ఎలాంటి సంకేతం ఇస్తోంది? 2024లో సొంత మెజారిటీ కోల్పోయిన బీజేపీ.. ఆ తర్వాత మళ్లీ ఎలా పుంజుకుంది? మహారాష్ట్రలో ప్రత్యర్థి పార్టీల చీలికలు, కొత్త కూటముల వెనుక ఉన్న రాజకీయ లెక్కలేమిటి? ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ విమర్శలు.. ఎస్ఐఆర్ వివాదం.. మరోవైపు రైతు చట్టాల రద్దు నుంచి అగ్నివీర్ విధానంలో కీలక మార్పుల వరకు మోదీ సర్కార్ పునరాలోచన ఎందుకు చేయాల్సి వచ్చింది? ఇవన్నీ రాజకీయ వ్యూహాలా? ప్రజా వ్యతిరేకత ప్రభావమా? బీజేపీ విస్తరణ వెనుక అసలు బలమేమిటి? ప్రతిపక్షాల బలహీనత ఎంతవరకు ఆ పార్టీకి కలిసొస్తోంది? ట్రంప్‌కు వచ్చిన ఎదురుదెబ్బ మోదీకి ముందస్తు హెచ్చరికా? లేక భారత రాజకీయాలకు అమెరికా నేర్పుతున్న మరో ప్రజాస్వామ్య పారమా?**

అమెరికాలో రెండేళ్ల పాలనకే డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి ఓటర్లు గట్టి ఎదురుదెబ్బ ఇచ్చారు. అధికార రిపబ్లికన్ పార్టీకి వ్యతిరేకంగా తీర్పునిస్తూ ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లోనూ డెమొక్రాట్లకు అధిక్యం కట్టబెట్టారు. అగ్రరాజ్యంలో ఈ పరిణామం ప్రపంచ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. ఆర్థిక పరిస్థితులు, నిత్యావసరాల ధరలు, ఇరాన్‌తో యుద్ధం, ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి ట్రంప్‌కు ప్రతికూలంగా మారాయా? అమెరికా ఓటర్ల తీర్పు కేవలం అక్కడి రాజకీయాలకే పరిమితమా? లేక ప్రపంచంలోని అధికార పార్టీలకు హెచ్చరికా? ఈ ప్రశ్నలు ఇప్పుడు భారత్‌కూ అన్వయించుకుంటున్నాయి. నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మూడో టర్మ్, పన్నెండేళ్లకు పైగా అధికారంలో కొనసాగుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంత మెజారిటీ కోల్పోయినా మిత్రపక్షాల మద్దతుతో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ ఫలితాన్ని ప్రజలు ఇచ్చిన హెచ్చరికగా కొందరు విశ్లేషిస్తే, ఆ తర్వాతి రాష్ట్రాల ఎన్నికల విజయాలు బీజేపీలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. దేశవ్యాప్తంగా పార్టీ బలం పెరుగుతోందని, మరిన్ని రాష్ట్రాల్లో అధికారం సాధిస్తామని నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే అమెరికా పరిణామం మరో కోణాన్ని గుర్తుచేస్తోంది. బలమైన అధికారం, నాయకుడి ప్రజాదరణ ఉన్నా ప్రజల ఆర్థిక సమస్యలు, పాలనపై అసంతృప్తి ఎన్నికల తీర్పును మార్చగలవు. ట్రంప్‌కు ఎదురైన ఫలితాన్ని మోదీకి నేరుగా అన్వయించలేకపోయినా, ప్రజాభిప్రాయాన్ని తక్కువ అంచనా వేయకూడదనే సందేశం మాత్రం ఇందులో స్పష్టంగా కనిపిస్తోంది.

### • అమెరికా తీర్పు.. భారత్‌కు ఎంతవరకు వర్తిస్తుంది?

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడిని నేరుగా ఎన్నుకోరు. ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలతో పాటు సెనేట్‌లో 35 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. అధ్యక్షుడి నాలుగేళ్ల పదవీకాలంలో రెండేళ్లకు జరిగే ఈ ఎన్నికలు ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తాయి. 2026 నవంబర్ 3న జరిగిన ఎన్నికల్లో డెమొక్రాట్లు రెండు సభల్లోనూ ఆధిక్యం సాధించడం ట్రంప్‌కు రాజకీయ ఎదురుదెబ్బగా మారింది. 2024లో ట్రంప్‌కు మద్దతిచ్చిన కొన్ని సంప్రదాయ రిపబ్లికన్ ప్రాంతాల్లోనూ డెమొక్రాట్లు విజయాలు సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అధ్యక్ష పదవిలో ట్రంప్ కొనసాగినా, కాంగ్రెస్‌పై ప్రతిపక్ష ఆధిపత్యం ఏర్పడటంతో బడ్జెట్, చట్టాల ఆమోదం, విధానాల అమలులో ఆయనకు సవాళ్లు తప్పవు. అయితే ఇది ట్రంప్ అధ్యక్ష పదవిని కోల్పోయినట్లు కాదు.. ఆయన పాలనపై ప్రజలు ఇచ్చిన మధ్యంతర తీర్పు మాత్రమే. భారత్‌లో లోక్‌సభ ఎన్నికలు కేంద్ర ప్రభుత్వ భవిష్యత్తును నిర్ణయిస్తే, అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్ర ప్రభుత్వాల పనితీరును అంచనా వేస్తాయి. రెండు దేశాల ఎన్నికల వ్యవస్థలు వేర్వేరైనా ఒక కీలకమైన పోలిక ఉంది. నాయకుడి వ్యక్తిగత ప్రజాదరణ ఒక్కటే విజయానికి హామీ కాదు. ఉపాధి, ధరలు, జీవన వ్యయం, రైతుల ఆదాయం, మధ్యతరగతి సమస్యలు, పాలనలో జవాబుదారీతనం ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం, అధిక జీవన వ్యయం, ఇరాన్ యుద్ధం వల్ల పెరిగిన ఆర్థిక భారం ప్రభుత్వానికి ప్రతికూలంగా మారిన అంశాలుగా చర్చకు వచ్చాయి. భారత్‌లోనూ నిరుద్యోగం, యువతకు అవకాశాలు, రైతుల సమస్యలు, ధరల పెరుగుదల ఎన్నికల రాజకీయాలను ప్రభావితం చేయగలవు. అందుకే అమెరికా ఫలితాన్ని భారత్‌కు నేరుగా అన్వయించలేకపోయినా, ఒక విషయం మాత్రం స్పష్టం.. ప్రజల సహనానికి హద్దు ఉంటుంది.. ఎన్ని కల్లో శా శ్వత సాధించిన విజయాన్ని ప్రజామోదంగా భావించడం ఏ అధికార పార్టీకైనా ప్రమాదమే.

### • మోదీ పాలనకు ప్రజామోదమా.. రాజకీయ వ్యూహమా?

అమెరికాలో ట్రంప్‌కు ఎదురుదెబ్బ తగిలినా భారత్‌లో బీజేపీ దూకుడు మాత్రం తగ్గడం లేదు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 240 స్థానాలకే పరిమితమై సొంత మెజారిటీ కోల్పోయిన బీజేపీ, మిత్రపక్షాల మద్దతుతో అధికారాన్ని కొనసాగిస్తోంది. ఉత్తరప్రదేశ్ వంటి కీలక రాష్ట్రాల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడం, గ్రామీణ ఓటర్ల అసంతృప్తి బయటపడటం పార్టీకి హెచ్చరికగా మారాయి. అయినప్పటికీ ఆ తర్వాత రాష్ట్రాల ఎన్నికల్లో విజయాలు, ప్రాంతీయ పార్టీలతో పొత్తులు, ప్రత్యర్థి పార్టీల నుంచి కీలక నాయకుల చేరికలతో బీజేపీ తన రాజకీయ పట్టును పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ విజయాలన్నీ మోదీ నాయకత్వానికి ప్రజామోదంగా బీజేపీ ప్రచారం చేస్తోంది. అయితే లోక్‌సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలన్నింటికీ ఒకే రాజకీయ ప్రాతిపదిక ఉండదు. కేంద్ర ప్రభుత్వ పనితీరుతో పాటు రాష్ట్రాల్లో స్థానిక నాయకత్వం, అభ్యర్థుల బలం, కుల సమీకరణలు, ప్రాంతీయ సమస్యలు ఫలితాలను ప్రభావితం చేస్తాయి. మరోవైపు బీజేపీకి ఉన్న పటిష్ఠమైన సంస్థాగత నిర్మాణం, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తల వ్యవస్థ, బూత్ స్థాయి సమన్వయం, బలమైన ప్రచార యంత్రాంగం ఆ పార్టీకి అదనపు బలాన్నిస్తున్నాయి. సంక్షేమ పథకాలు, జాతీయ భద్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధి, హిందుత్వ రాజకీయాలను కలిపి ప్రజల్లో తనదైన రాజకీయ ప్రభావాన్ని నిర్మించుకుంటోంది. అంటే బీజేపీ బలం కేవలం మోదీ ప్రజాదరణలోనే కాదు.. సంస్థాగత పట్టు, ఎన్నికల వ్యూహాలు, ప్రత్యర్థుల బలహీనతలను అనుకూలంగా మలుచుకోవడంలోనూ ఉంది. అయితే ఈ వ్యూహాలు శాశ్వత విజయాలకు హామీ కావు. ప్రజల సమస్యలు పరిష్కారం కాకపోతే బలమైన ఎన్నికల యంత్రాంగం కూడా అసంతృప్తిని ఆపలేదు. ట్రంప్ రాజకీయ అనుభవం బీజేపీకి గుర్తుచేస్తున్న పాఠం ఇదే.

### •మహారాష్ట్ర మోడల్.. చీలికలతో బీజేపీ రాజకీయ విస్తరణ!

బీజేపీ రాజకీయంగా బలపడటంలో ప్రత్యర్థి పార్టీల బలహీనతలను తనకు అనుకూలంగా మలుచుకోవడం కీలక వ్యూహంగా కనిపిస్తోంది. దీనికి మహారాష్ట్ర రాజకీయాలే ప్రధాన ఉదాహరణ. ఒకప్పుడు శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ బలమైన శక్తులుగా ఉన్న రాష్ట్రంలో కాలక్రమేణా రాజకీయ చీలికలు చోటుచేసుకున్నాయి. శివసేనలో ఏక్‌నాథ్ షిండే వర్గం విడిపోయి బీజేపీతో అధికారాన్ని పంచుకోగా, ఉద్ధవ్ ఠాక్రే వర్గం ప్రతిపక్షంలోకి వెళ్లింది. ఎన్సీపీలో అజిత్ పవార్ వర్గం శరద్ పవార్ నాయకత్వం నుంచి విడిపోయి అధికార కూటమిలో చేరింది. దీంతో రాష్ట్ర రాజకీయ సమీకరణాలే మారిపోయాయి. ఒకప్పుడు ప్రత్యర్థులుగా ఉన్న నాయకులతోనే బీజేపీ అధికార భాగస్వామ్యం ఏర్పాటు చేసుకుంది. ఈ పరిణామాల వెనుక అధికార సమీకరణలు, నాయకుల రాజకీయ భవిష్యత్తు, ఎన్నికల గణాంకాలు, సామాజిక వర్గాల ప్రభావం కీలకంగా పనిచేశాయి. ఈ వ్యూహంతో ప్రత్యర్థి పార్టీల ఓటు బ్యాంకుల్లో చీలిక ఏర్పడటంతో పాటు స్థానికంగా బలమున్న నాయకులను కూటమిలోకి తీసుకునే అవకాశం బీజేపీకి లభించింది. అయితే ఇలాంటి రాజకీయ కలయికలు అవకాశవాదమనే విమర్శలకు దారితీయడంతో పాటు పాత కార్యకర్తల్లో అసంతృప్తి, కూటమిలో ఆధిపత్య పోరుకు కారణమవుతాయి. అయినప్పటికీ బీజేపీ ప్రాంతీయ పార్టీలతో పొత్తులు, ప్రత్యర్థి నాయకుల చేరికలు, స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యమిస్తూ ఇతర రాష్ట్రాల్లోనూ తన రాజకీయ విస్తరణకు ప్రయత్నిస్తోంది. ప్రత్యర్థులను ఎన్నికల్లో ఓడించడమే కాదు.. వారి రాజకీయ బలాన్ని విభజించి కొత్త అధికార సమీకరణాలు నిర్మించడం కూడా ఈ వ్యూహంలో భాగంగా కనిపిస్తోంది. అయితే కూటములు, చీలికలు ఎన్నికల లెక్కలను మార్చగలవే తప్ప ప్రజల విశ్వాసానికి ప్రత్యామ్నాయం కాలేవు. చివరకు పాలనలో పనితీరే ప్రజాదరణకు అసలైన కొలమానం.

### • రైతు చట్టాల నుంచి అగ్నివీర్ వరకు.. మోదీ సర్కార్ పునరాలోచన!


బలమైన నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వంగా గుర్తింపు పొందిన మోదీ సర్కార్ సైతం ప్రజా వ్యతిరేకత తీవ్రతరమైనప్పుడు పునరాలోచనకు దిగాల్సి వస్తోంది. దీనికి 2020లో తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలే నిదర్శనం. వ్యవసాయ మార్కెట్లలో సంస్కరణలు, ప్రైవేటు పెట్టుబడులకు అవకాశాలే లక్ష్యమని కేంద్రం సమర్థించినా, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ సహా పలు రాష్ట్రాల రైతులు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఉండదనే ఆందోళనతో ఉద్యమించారు. ఢిల్లీ సరిహద్దుల్లో నెలల తరబడి సాగిన నిరసనలతో చివరకు 2021 నవంబర్‌లో ప్రధాని మోదీ మూడు చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీన్ని రైతు ఉద్యమ విజయంగా ప్రతిపక్షాలు అభివర్ణిస్తే, ప్రజల అభిప్రాయాలను గౌరవించి తీసుకున్న నిర్ణయంగా బీజేపీ సమర్థించుకుంది. ఇప్పుడు అగ్నిపథ్ విషయంలోనూ కీలక మార్పులు చర్చకు వచ్చాయి. 2022లో ప్రవేశపెట్టిన ఈ పథకం ప్రకారం నాలుగేళ్ల సేవ తర్వాత గరిష్ఠంగా 25 శాతం అగ్నివీరులకు మాత్రమే సాధారణ సైనికులుగా కొనసాగే అవకాశం ఉండేది. మిగిలిన 75 శాతం మంది బయటకు రావాల్సి వచ్చేది. ఉద్యోగ భద్రత, పెన్షన్, భవిష్యత్తు ఉపాధిపై యువత, మాజీ సైనికులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 2026 నవంబర్ 4న కేంద్ర మంత్రివర్గం మార్పులకు ఆమోదం తెలిపింది. మొదటి నాలుగేళ్ల తర్వాత ఎంపిక కాని అగ్నివీరులకు మరో రెండేళ్ల సేవా అవకాశం కల్పించి, ఆ తర్వాత అర్హత, ఆసక్తి ఆధారంగా సాధారణ సైనిక సేవలో చేరే మార్గాన్ని ప్రతిపాదించింది. అయితే ఇది అగ్నిపథ్ రద్దు కాదు.. నియామక విధానంలో మార్పు మాత్రమే. ప్రభుత్వం దీన్ని సైనిక అవసరాలు, అనుభవం ఆధారంగా తీసుకున్న నిర్ణయంగా వివరిస్తుండగా, విమర్శకులు విధానంలో గణనీయమైన మార్పుగా చూస్తున్నారు. రైతు చట్టాల రద్దు నుంచి అగ్నివీర్ మార్పుల వరకు ఒక విషయం స్పష్టమవుతోంది.. బలమైన మెజారిటీ ఉన్నా ప్రజల ఆందోళనలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించలేని పరిస్థితి ఉంటుంది. ఇది ప్రభుత్వ బలహీనతా? ప్రజాస్వామ్య సర్దుబాటా? అన్నది పక్కనపెడితే, ప్రజల అభిప్రాయమే విధానాల దిశను మార్చగలదన్నది ఈ పరిణామాల సారాంశం.






### • ఎస్ఐఆర్ వివాదం.. జ్ఞానేశ్ కుమార్‌పై రాహుల్ విమర్శలు..

దేశ రాజకీయాల్లో ఎన్నికల సంఘం పనితీరు ఇప్పుడు మరో కీలక వివాదంగా మారింది. ఓటర్ల జాబితాల ప్రక్షాళన కోసం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. అనర్హుల పేర్ల తొలగింపు పేరుతో నిజమైన ఓటర్ల హక్కులకు భంగం కలిగే ప్రమాదం ఉందని, ముఖ్యంగా పేదలు, వలస కార్మికులు, సరైన పత్రాలు లేని కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే ఓటర్ల జాబితాలను పారదర్శకంగా, కచ్చితంగా రూపొందించడమే లక్ష్యమని ఎన్నికల సంఘం చెబుతోంది. ఈ నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేస్తూ, ఆయన వల్లే మోదీ ప్రధానిగా, అమిత్ షా హోంమంత్రిగా కొనసాగుతున్నారనే స్థాయిలో విమర్శలు చేయడం రాజకీయ వేడిని పెంచింది. ఎన్నికల సంఘం స్వతంత్రతపై సందేహాలు తలెత్తినా, ప్రతిపక్షాల ఆరోపణలు ఆధారాలు లేకుండా ప్రచారంలోకి వచ్చినా ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసం దెబ్బతింటుంది. అందుకే ఎస్ఐఆర్‌లో పారదర్శకత, ఓటర్లకు సమాచారం, అభ్యంతరాల స్వీకరణ, తొలగించిన అర్హుల పేర్ల పునరుద్ధరణకు స్పష్టమైన అవకాశం ఉండాలి. కేంద్రం, ఎన్నికల సంఘం ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కలిగి ఉండగా, ప్రతిపక్షాలు కూడా ఆధారాలతో తమ అభ్యంతరాలను నిరూపించాలి. ఎందుకంటే ఓటు హక్కుపై అనుమానాలు తలెత్తితే నష్టం ఏ ఒక్క పార్టీకో కాదు.. మొత్తం ప్రజాస్వామ్య వ్యవస్థకే. అమెరికా పరిణామాలు కూడా ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసం ఎంత కీలకమో గుర్తుచేస్తున్నాయి. భారత్‌లో ఎన్నికల సంఘం విశ్వసనీయత రాజకీయాలకు అతీతంగా నిలవాల్సిన అవసరం మరింత పెరిగింది.



### • ట్రంప్ నుంచి మోదీ నేర్చుకోవాల్సిన పాఠం ఏమిటి?

అమెరికాలో ట్రంప్‌కు ఎదురైన రాజకీయ పరిణామాలు మోదీ నాయకత్వానికి ఎలాంటి సందేశం ఇస్తున్నాయి? దేశవ్యాప్తంగా బీజేపీ విస్తరిస్తోందని ఆ పార్టీ నేతలు చెబుతున్నా, ప్రజల అసంతృప్తిని అంచనా వేయడంలో ఎక్కడైనా పొరపాటు జరుగుతోందా? ఒకవైపు మోదీ వ్యక్తిగత ప్రజాదరణ, సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, అంతర్జాతీయంగా భారత్‌కు పెరుగుతున్న గుర్తింపును బీజేపీ తన బలంగా చూపుతోంది. మరోవైపు నిరుద్యోగం, యువతకు ఉపాధి, రైతుల ఆదాయం, ధరల పెరుగుదల, చిన్న వ్యాపారుల సమస్యలు ప్రభుత్వానికి సవాళ్లుగా నిలుస్తున్నాయి. రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ ఎన్నికల సంఘం స్వతంత్రత, ఎస్ఐఆర్, ఓటర్ల హక్కులపై ప్రశ్నలు సంధిస్తుండగా, ప్రాంతీయ పార్టీలు కూడా బీజేపీ విస్తరణను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయి. అయితే ప్రతిపక్షాల ముందున్న సవాలు కేవలం విమర్శలు చేయడం కాదు.. నమ్మదగిన ప్రత్యామ్నాయ నాయకత్వం, విధానాలు, ఐక్యమైన రాజకీయ వ్యూహాన్ని ప్రజల ముందుంచడం. ఈ విషయంలో సమన్వయ లోపం బీజేపీకి రాజకీయంగా కలిసివస్తోంది. కానీ ట్రంప్ అనుభవం మరో కీలక విషయాన్ని గుర్తుచేస్తోంది. బలమైన ప్రచారం, నాయకుడి ఇమేజ్, రాజకీయ ప్రత్యర్థుల బలహీనతలు ఉన్నా ప్రజల జీవన సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఎదురుదెబ్బ తప్పదు. అమెరికాలో ట్రంప్ అధ్యక్ష పదవిలో కొనసాగుతున్నప్పటికీ కాంగ్రెస్‌పై ప్రతిపక్ష ఆధిపత్యం ఏర్పడటం ఆయన పాలనకు ప్రజలు ఇచ్చిన సంకేతం. భారత్‌లోనూ 2024 ఎన్నికల్లో బీజేపీ సొంత మెజారిటీ కోల్పోవడం ప్రజల ఆకాంక్షలను పునఃపరిశీలించాల్సిన పరిణామంగా చూడాలి. రైతుల సమస్యలు, యువత ఉపాధి, అగ్నివీరుల భవిష్యత్తు, సామాన్యుల ఆర్థిక పరిస్థితి, ప్రజాస్వామ్య సంస్థల విశ్వసనీయతపై ప్రభుత్వం ప్రజల్లో నమ్మకం కల్పించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో ప్రతిపక్షాలు కూడా విమర్శలకు మించి ప్రత్యామ్నాయ విధానాలతో ముందుకు రావాలి. ట్రంప్‌కు ఎదురైన ఫలితాన్ని మోదీ ప్రభుత్వ పతనానికి సంకేతంగా చూడటం ఎంత తొందరపాటో, బీజేపీ విస్తరిస్తోందని ప్రజల అసంతృప్తిని కొట్టిపారేయడం కూడా అంతే తొందరపాటు. అమెరికా తీర్పు భారత్‌కు నేరుగా వర్తించకపోవచ్చు.. కానీ ప్రజాస్వామ్యంలో అంతిమ అధికారం ఓటరుదేనన్నే సత్యాన్ని గుర్తుచేస్తోంది. ఎన్నికల్లో గెలవడం ఒక ఎత్తయితే, ప్రజల విశ్వాసాన్ని నిరంతరం నిలబెట్టుకోవడం మరో ఎత్తు. బీజేపీ భవిష్యత్ రాజకీయ ప్రయాణంలో ఈ రెండింటి మధ్య సమతుల్యతే కీలకం.




# సరెండర్ కాదు.. సమరమే..!

## అలుపెరుగని పోరాటం

ఒక్క పిలుపు.. ఒక్క వేదిక.. ఒక్క గర్జన! రెండున్నరేళ్లుగా రాజకీయ సవాళ్లతో సతమతమవుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఒక్కసారిగా కదలిక మొదలైంది. స్థానిక ఎన్నికల్లో ఫలితాలు అనుకూలంగా రాకపోయినా.. పోరాటమే తమ విజయమంటూ జగన్ చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు తెరలేపింది. నామినేషన్ల దగ్గర మొదలైన అడ్డంకులు.. పోలింగ్ బూత్‌లలో దాడులు.. ఏజెంట్ల నిర్బంధాలు.. రిగ్గింగ్ ఆరోపణలు.. సీసీ కెమెరాలపై ప్రశ్నలు.. ఇలా ఎన్నికల ప్రక్రియలో చోటుచేసుకున్న ప్రతి పరిణామాన్ని ఏకరువు పెడుతూ చంద్రబాబు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 17 మున్సిపాలిటీల నుంచి 84 జెడ్పీటీసీ స్థానాల వరకు తమకు ఎదురైన పరిస్థితులను వివరించారు. సూపర్ సిక్స్ హామీల నుంచి తుపాన్ల బాధితుల వరకు ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావించారు. కార్యకర్తలను హీరోలుగా అభివర్ణించి, కేసులకు భయపడేది లేదని భరోసా ఇచ్చారు. చంద్రబాబు గెలిచి ఓడితే.. మేం ఓడి గెలిచాం! అంటూ చేసిన వ్యాఖ్యతో తన రాజకీయ సందేశాన్ని స్పష్టం చేశారు. అసలు ఈ ఎన్నికల్లో జగన్ సాధించాలనుకున్నదేమిటి? ఓటమిని పార్టీకి కొత్త ఊపిరిగా మార్చగలరా? స్థానిక పోరును రాష్ట్రవ్యాప్త రాజకీయ సంగ్రామంగా మలచగలరా?

- వైసీపీని కాపాడే ఆరాటం
- రాజీ లేకుండా తలపడిన కేడర్
- తెగించి ముందుకెళ్లమన్న లీడర్
- ఓడినా గెలుపు మాదేనన్న జగన్

రెండున్నరేళ్లుగా రాజకీయంగా అనేక సవాళ్లు ఎదుర్కొంటున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికలు మరోసారి తన బలాన్ని చాటుకునే వేదికగా మారాయి. ఎన్నికల ఫలితాలు కూటమికి అనుకూలంగా వచ్చినప్పటికీ, ఈ ఎన్నికల సందర్భంగా జగన్ అనుసరించిన రాజకీయ వైఖరి, పార్టీ శ్రేణులను సమీకరించిన తీరు, కార్యకర్తలకు ఇచ్చిన భరోసా ఇప్పుడు రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి. అధికారంలో ఉన్న పార్టీతో పోరాడటానికి అవసరమైన రాజకీయ వాతావరణాన్ని నిర్మించడమే లక్ష్యంగా జగన్ తన వ్యూహాన్ని రూపొందించారు. నామినేషన్ల నుంచి పోలింగ్ వరకు తమ అభ్యర్థులకు ఎదురైన ఇబ్బందులను ప్రజల ముందుకు తీసుకెళ్లారు. అధికార యంత్రాంగం తమకు వ్యతిరేకంగా పనిచేస్తోందని ఆరోపిస్తూ, కార్యకర్తలు వెనక్కి తగ్గవద్దని పిలుపునిచ్చారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా ఎన్నికల్లో ఎదురైన ఇబ్బందులను వివరించడంతో పాటు, వాటిని ఎదుర్కొన్న నాయకులు, కార్యకర్తలను నిజమైన హీరోలుగా అభివర్ణించడం ద్వారా వారికి రాజకీయంగా అండగా నిలిచే ప్రయత్నం చేశారు. ఒక్క పిలుపుతో పార్టీ శ్రేణులను సమీకరించడం, స్థానిక స్థాయిలో ఎదురైన పరిణామాలను రాష్ట్రవ్యాప్త రాజకీయ అంశంగా మార్చడం ఈ పోరాటంలో జగన్ ముందుంచిన ప్రధాన లక్ష్యాలుగా కనిపించాయి. అయితే ఎన్నికల ఫలితాల పరంగా ఎదురైన పరాజయాన్ని ఆయన దాచిపెట్టలేదు. అధికార పార్టీ విజయం సాధించినట్లు కనిపించినా, ప్రజాస్వామ్య హక్కుల కోసం తమ పార్టీ పోరాడిందని, ఆ పోరాటమే తమకు నైతిక విజయమని ప్రకటించారు. ఈ వ్యాఖ్యలతో ఎన్నికల ఫలితాల చర్చను కేవలం గెలుపోటములకే పరిమితం చేయకుండా, ఎన్నికల నిర్వహణ, ప్రతిపక్ష హక్కులు, ప్రజాస్వామ్య వ్యవస్థల విశ్వసనీయత వైపు మళ్లించారు.

### • ఎన్నికలా.. సెలక్షన్లా? నామినేషన్ల నుంచే పోరాటం

ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అడ్డుకునేందుకు అధికార పార్టీ ప్రయత్నించిందనేది జగన్ ప్రధాన ఆరోపణ. ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలే పునాదులని, కానీ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఆ పునాదులనే దెబ్బతీశారని ఆయన విమర్శించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే తమ పార్టీకి చెందిన వేలాది మంది నాయకులు, కార్యకర్తలను బైండ్ ఓవర్ పేరుతో పోలీస్ స్టేషన్లకు పిలిపించి బెదిరించారని ఆరోపించారు. నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, స్క్రూటినీ సమయంలో పత్రాలను మాయం చేయడం, సంతకాలు ఫోర్జరీ చేయడం, నామినేషన్లను తిరస్కరించడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని వివరించారు. అనంతరం అభ్యర్థులపై ఒత్తిడి తెచ్చి నామినేషన్లు ఉపసంహరించుకునేలా చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి నుంచి క్షేత్రస్థాయి అధికారుల వరకు ఒక వ్యవస్థలా పనిచేస్తూ ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేశారని, ఎన్నికల కమిషన్ కూడా తగిన విధంగా వ్యవహరించలేదని మండిపడ్డారు. 17 మున్సిపాలిటీల్లో తమ చైర్‌పర్సన్ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వలేదని, మరో 22 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో నామినేషన్ల దశలోనే పోటీకి అడ్డంకులు సృష్టించారని పేర్కొన్నారు. పులివెందులలో 40 వార్డులు ఉంటే కేవలం 20 వార్డులకే నామినేషన్లు వేయగలిగే పరిస్థితి కల్పించారని చెప్పారు. పరిషత్ ఎన్నికల్లో 84 జెడ్పీటీసీ, 2,109 ఎంపీటీసీ స్థానాల్లో తమ అభ్యర్థులకు పోటీ చేసే అవకాశం లేకుండా చేశారని ఆరోపించారు. ఈ గణాంకాలను ప్రస్తావిస్తూ, స్థానిక స్థాయిలో పార్టీ అభ్యర్థులకు జరిగిన అన్యాయాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లారు. తమకు పోటీ చేసే అవకాశం ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వాదించారు. శకుని పాచికలతో ఆటను మలిచినట్లుగా అధికార దుర్వినియోగంతో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేశారని విమర్శించారు. అందుకే ఇవి నిజమైన ఎన్నికలా, లేక ముందుగానే నిర్ణయించిన అభ్యర్థుల ఎంపికలా అని ప్రశ్నించారు. పార్టీకి ఎదురైన సమస్యను వ్యక్తిగత రాజకీయ అంశంగా కాకుండా, అభ్యర్థుల పోటీ హక్కు, ఓటర్ల ఎంపిక స్వేచ్ఛకు సంబంధించిన అంశంగా జగన్ ప్రజల ముందుంచే ప్రయత్నం చేశారు.

### • బూత్‌ల నుంచి బ్యాలెట్ బాక్సుల వరకు ఆరోపణలు

నామినేషన్ల దశలో మొదలైన సమస్యలు పోలింగ్ రోజున మరింత తీవ్రమయ్యాయని జగన్ తన మీడియా సమావేశంలో వివరించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల నుంచి బయటకు పంపించారని, మరికొన్ని చోట్ల వారిని పోలీస్ స్టేషన్లకు తరలించారని ఆరోపించారు. అనంతపురం జిల్లా శింగనమలలోని సోదనపల్లి, ఉరవకొండలోని కూడేరు, మురట్ల, కనిగిరి నియోజకవర్గంలోని వెలిగండ్ల, కర్నూలు రూరల్ మండలంలోని సుంకేసుల వంటి ప్రాంతాల్లో జరిగిన ఘటనలను ప్రస్తావించారు. విజయనగరం, పుంగనూరు, దర్శి, జగ్గయ్యపేట, కనిగిరి, ఆలూరు ప్రాంతాల్లోనూ ఏజెంట్లను అడ్డుకున్నారని చెప్పారు. పులివెందుల నియోజకవర్గంలో అచ్చివెల్లి, వేముల, లింగాల, మోట్నూతలపల్లి ప్రాంతాల్లో ఓటర్లను భయపెట్టడం, ఏజెంట్లను అనుమతించకపోవడం, మహిళలపై లాఠీచార్జి వంటి ఘటనలు జరిగాయని ఆరోపించారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని నల్లపురెడ్డిపల్లిలో పెట్రోల్ బాంబులతో దాడులు జరిగాయని, శ్రీకాకుళం జిల్లా పట్టుపురంలో రిగ్గింగ్‌ను అడ్డుకున్న వారిపైనే కేసులు పెట్టారని విమర్శించారు. చంద్రగిరి సాయినగర్‌లో దొంగ ఓటర్లను తమ పార్టీ నాయకులు పట్టుకున్నారని, పీలేరులో బహిరంగంగానే రిగ్గింగ్ జరిగిందని పేర్కొన్నారు. పులివెందులలో 80 పోలింగ్ కేంద్రాలుంటే 70 చోట్ల తమ ఏజెంట్లను కూర్చోనివ్వలేదని, అనంతరం బూత్‌లను ఆక్రమించారనేది ఆయన మరో ఆరోపించారు. తిరుపతిలో సిరా గుర్తులను చెరిపేందుకు రసాయనాలు సిద్ధం చేశారని, వలయపునగర్‌లో రిగ్గింగ్, సైకిలింగ్ జరిగాయని చెప్పారు. ఎన్నికల అక్రమాలను చిత్రీకరించేందుకు వెళ్లిన జర్నలిస్టులపై కూడా దాడులు జరిగాయని ప్రస్తావించారు. జర్నలిస్టులపై దాడులు జరిగినట్లు పేర్కొంటూ, సీసీటీవీ దృశ్యాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలన్నింటినీ ఒకే వేదికపై ప్రస్తావించడం ద్వారా స్థానికంగా జరిగిన ఘటనలను రాష్ట్రవ్యాప్త సమస్యగా మార్చారు. పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్ల హక్కులు, ఓటర్ల భద్రత, మీడియా స్వేచ్ఛ అనే మూడు అంశాలను తన రాజకీయ పోరాటంలో భాగం చేశారు. అయితే ఈ ఘటనలకు సంబంధించి జగన్ చేసిన ఆరోపణలు, వాటిపై అధికార యంత్రాంగం ఇచ్చే వివరణలు వేర్వేరుగా పరిశీలించాల్సిన అంశాలుగా మిగిలాయి.

### • సీసీ కెమెరాలు.. పోలింగ్ శాతాలపై జగన్ ప్రశ్నలు

ఎన్నికల నిర్వహణలో పారదర్శకత లేదని చెప్పడానికి జగన్ పలు గణాంకాలను తన మీడియా సమావేశంలో ప్రస్తావించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం నామినేషన్ కేంద్రాలు, స్ట్రూటినీ, విత్‌డ్రాయల్ ప్రక్రియ, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఆదేశాలు పూర్తిగా అమలుకాలేదని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో 11,378 పోలింగ్ కేంద్రాలకు గాను 5,737 కేంద్రాల్లో మాత్రమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో 31,460 కేంద్రాలకు గాను 16,064 కేంద్రాల్లోనే కెమెరాలు పెట్టారని వివరించారు. మిగిలిన కేంద్రాల్లో ఏం జరిగిందో ఎలా తెలుసుకోవాలని ప్రశ్నించారు. విశాఖపట్నంలో సాయంత్రం ఐదు గంటలకు 9,19,367 ఓట్లు పోలైనట్లు ప్రకటించగా, రాత్రి 9.30 గంటలకు ఆ సంఖ్య 9,45,915కు, సోమవారం ఉదయానికి 10,35,154కు చేరిందని చెప్పారు. అంటే ప్రకటించిన లెక్కల్లో 1,15,787 ఓట్లు పెరిగాయని పేర్కొన్నారు. చీమకుర్తి, జమ్మలమడుగు, అద్దంకి, ధర్మవరం, చిలకలూరిపేట, పార్వతీపురం ప్రాంతాల్లోనూ తక్కువ వ్యవధిలో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగినట్లు వివరించారు. చిత్తూరు కార్పొరేషన్‌లో 92,900 ఓట్లు పోలైనట్లు ప్రకటించినప్పటికీ, కౌంటింగ్ సమయంలో అంతకంటే ఎక్కువ ఓట్లు కనిపించాయని, దాదాపు 7,000 ఓట్ల తేడా ఉందని ఆరోపించారు. అనంతపురం 30వ డివిజన్‌లో రిగ్గింగ్ ఆరోపణల నేపథ్యంలో రీపోలింగ్ నిర్వహించినా, గతంలో ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తే మళ్లీ ఓటు వేసినట్లు విమర్శించారు. ఈ అంశాలన్నింటినీ ప్రస్తావిస్తూ నామినేషన్ల రిగ్గింగ్, స్ట్రూటినీ రిగ్గింగ్, పోలింగ్ బూత్‌ల రిగ్గింగ్, పోలింగ్ శాతాల రిగ్గింగ్ అంటూ ఎన్నికల ప్రక్రియపై ప్రశ్నలు సంధించారు. విశాఖలో స్ట్రాంగ్ రూములకు సీల్ వేయాలని తమ పార్టీ నాయకులు ఆందోళన చేసిన తర్వాతే అధికారులు చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఇక్కడ జగన్ అనుసరించిన మరో రాజకీయ వ్యూహం గణాంకాల ఆధారంగా తన వాదనను ప్రజలకు వివరించడం. కేవలం దాడులు జరిగాయని చెప్పడం కాకుండా, పోలింగ్ శాతాల్లో మార్పులు, సీసీ కెమెరాల సంఖ్య, కౌంటింగ్ వివరాలను ప్రస్తావించి ఎన్నికల పారదర్శకతపై చర్చను ముందుకు తీసుకెళ్లారు. ఎన్నికల ప్రక్రియపై అనుమానాలుంటే వాటికి ఆధారాలతో సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నది ఆయన ప్రధాన వాదన.

### • హామీల వైఫల్యాలే ప్రభుత్వంపై రాజకీయ అస్త్రం

ఎన్నికల అక్రమాల ఆరోపణలతో పాటు కూటమి ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనను కూడా జగన్ తన ప్రసంగంలో ప్రధానంగా ప్రస్తావించారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు, మేనిఫెస్టోలో ప్రకటించిన 143 వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ ప్రయోజనం కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. మహిళలకు ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఓబీసీ నేస్తం వంటి పథకాలు అందడం లేదని, సున్నా వడ్డీ పథకం కూడా నిలిచిపోయిందని ఆరోపించారు. విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు సరిగా అమలుకావడం లేదని, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి ఇస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. రైతులకు ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ, గిట్టుబాటు ధర వంటి ప్రయోజనాలు అందడం లేదని పేర్కొన్నారు. ఉద్యోగులకు ఐఆర్, పీఆర్సీ అమలు చేస్తామని చెప్పి మాట తప్పారని, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, రూ.40 వేల కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత ఉందని, ఆరోగ్యశ్రీ సేవలు కూడా సరిగా అందడం లేదని విమర్శించారు. మరోవైపు 17 మెడికల్ కాలేజీలు, పోర్టులు, హార్బర్లు, ప్రభుత్వ భూముల వ్యవహారాల్లో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, మద్యం, గంజాయి సమస్యలను కూడా ప్రస్తావించారు. రాజధాని, ఇసుక, మట్టి, లేటరైట్ వ్యవహారాల్లో స్కాములు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ ఆరోపణలతో పాటు పరుస తుపాన్ల సమయంలో ప్రభుత్వం స్పందించిన తీరును ప్రశ్నించారు. అర్నబ్ తుపానులో పది మంది, మురుసు తుపానులో ఇద్దరు మరణించారని, పలు గ్రామాలకు విద్యుత్ పునరుద్ధరణ ఆలస్యమైందని చెప్పారు. రైతులకు పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ అందించడంలోనూ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజల రోజువారీ సమస్యలను ఎన్నికల రాజకీయాలతో అనుసంధానించడం ద్వారా ప్రభుత్వ పాలనపై అసంతృప్తిని పార్టీకి అనుకూలమైన రాజకీయ చర్చగా మలచాలని జగన్ ప్రయత్నించారు.

### • ఓటమిలోనూ గెలుపు.. కార్యకర్తలకు జగన్ భరోసా

ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఎదురైన పరాజయం రాజకీయంగా చిన్న విషయం కాదు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ఆధిపత్యం ప్రదర్శించిన నేపథ్యంలో పార్టీ భవిష్యత్తుపై సహజంగానే ప్రశ్నలు తలెత్తాయి. అయినప్పటికీ జగన్ తన ప్రసంగంలో ఫలితాల కంటే పోరాటానికి ప్రాధాన్యం ఇచ్చారు. అధికారంలో ఉన్న పార్టీతో పోటీపడటం, అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ అభ్యర్థులను నిలబెట్టడం, కార్యకర్తలు వెనక్కి తగ్గకుండా పనిచేయడం తమకు ముఖ్యమని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొన్న దాడులు, కేసులు, నిర్బంధాలను ప్రస్తావిస్తూ వారిని నిజమైన హీరోలుగా అభివర్ణించారు. వారి పోరాటానికి సెల్యూట్ చేస్తున్నానని ప్రకటించారు. పులివెందులలో తమ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించకపోవడంపై ఆర్వోకు ఫిర్యాదు చేశామని, ప్రజాస్వామ్యబద్ధంగా, గాంధేయ పద్ధతిలో నిరసన తెలిపినందుకే కేసులు పెట్టారని విమర్శించారు. కేసులకు భయపడేది లేదని, పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన చేసిన చంద్రబాబు గెలిచి ఓడితే.. మేం ఓడి గెలిచాం అనే వ్యాఖ్య రాజకీయంగా ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల ఫలితాల్లో కూటమి ఆధిక్యం సాధించిన విషయాన్ని కాదనకుండా, ప్రజాస్వామ్య హక్కుల కోసం తమ పార్టీ చేసిన పోరాటాన్ని నైతిక విజయంగా అభివర్ణించారు. ఓటు హక్కును కాపాడుకోవడం అంటే రేపు ఆస్తి హక్కును కూడా కాపాడుకోవడమేనని చెబుతూ, 22ఏ నిషేధిత జాబితాలో భూములను చేర్చిన అంశాన్ని ప్రస్తావించారు. ఈరోజు నామినేషన్ పత్రాలు, ఓటు హక్కుపై దాడి జరిగితే రేపు ప్రజల ఆస్తులపై కూడా ఇలాంటి పరిస్థితి రావచ్చని హెచ్చరించారు. చివరగా హే రామ్.. సేవ్ ఆంధ్ర.. సేవ్ డెమోక్రసీ అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. అయితే ఈ పోరాటం పార్టీకి ఎన్నికల పరంగా తక్షణ విజయాన్ని అందించిందని చెప్పడానికి ఫలితాలు మద్దతు ఇవ్వడం లేదు. నవంబర్ 3న వెలువడిన మున్సిపల్ ఫలితాల్లో కూటమి స్పష్టమైన ఆధిక్యం సాధించింది. వైఎస్సార్‌సీపీకి పరిమిత విజయాలే దక్కాయి. అందువల్ల ఈ ఎన్నికలను పార్టీ పునరుజ్జీవనానికి పూర్తిస్థాయి సంకేతంగా కాకుండా, ప్రతిపక్షంగా తన రాజకీయ కార్యాచరణను తిరిగి నిర్మించుకునే ప్రయత్నంగా చూడాల్సి ఉంటుంది. స్థానిక స్థాయిలో ఓటమిని ఎదుర్కొన్నప్పటికీ కార్యకర్తలకు భరోసా ఇవ్వడం, ప్రజాస్వామ్య హక్కుల అంశాన్ని ముందుకు తీసుకెళ్లడం, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నలు సంధించడం ద్వారా పార్టీకి కొత్త రాజకీయ దిశను చూపించాలన్నది జగన్ ప్రయత్నం. రాబోయే రోజుల్లో ఈ మాటలు క్షేత్రస్థాయిలో ఎంతటి కార్యాచరణగా మారతాయి? నాయకులు, కార్యకర్తలను ఎంతవరకు సమన్వయం చేయగలుగుతారు? ప్రజల్లో పార్టీపై తిరిగి విశ్వాసాన్ని ఎలా నిర్మించుకుంటారు? అన్నదానిపైనే వైఎస్సార్‌సీపీ భవిష్యత్ ఆధారపడి ఉంటుంది.






# వద్దు మహా ప్రభో ఇక చాలు తప్పుకో..

## వెళ్లు ట్రంప్.. వెళ్లూ.. ఏం చెప్పావ్ ఏం చేశావ్?

# ట్రంప్‌ను వీటో చేసిన అమెరికన్లు

అమెరికా రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని రిపబ్లికన్ పార్టీకి మధ్యంతర ఎన్నికలు గట్టి షాక్ ఇచ్చాయి. నవంబర్ 3, 2026న జరిగిన ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌పై కూడా ఆధిపత్యం సాధించి అధికార సమీకరణాలను పూర్తిగా మార్చేసింది. సాధారణంగా అమెరికా మధ్యంతర ఎన్నికలను అధికారంలో ఉన్న అధ్యక్షుడి పాలనపై ప్రజలు ఇచ్చే తీర్పుగా పరిగణిస్తారు. ఈసారి ఫలితాలు మాత్రం ట్రంప్ ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరికగా మారాయి. రెండేళ్ల క్రితం అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు భారీ మద్దతు పలికిన ప్రాంతాల్లోనే ఇప్పుడు రిపబ్లికన్లు ఓటమిని చవిచూడటం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. రిపబ్లికన్లకు సంప్రదాయంగా బలమైన మద్దతు ఇచ్చే రాష్ట్రాల్లోనూ డెమోక్రటిక్ అభ్యర్థులు విజయాలు సాధించారు. ముఖ్యంగా సాధారణంగా రిపబ్లికన్లకు రెండంకెల ఆధిక్యం లభించే సంప్రదాయవాద ప్రాంతాల్లో డెమోక్రాట్ల పట్టు పెరగడం ఈ ఎన్నికల ఫలితాల్లో అత్యంత కీలకమైన అంశంగా నిలిచింది. ఈ పరిణామం కేవలం కొన్ని స్థానాల మార్పుగా చూడలేం. ట్రంప్ రాజకీయ విధానాలు, ఆయన నిర్ణయాలు, ప్రజలకు ఇచ్చిన హామీలపై ఓటర్లు తమ అసంతృప్తిని బ్యాలెట్ ద్వారా వ్యక్తం చేసినట్లు కనిపిస్తోంది. ప్రతినిధుల సభ, సెనేట్ రెండింటినీ డెమోక్రాట్లు కైవసం చేసుకోవడంతో అమెరికా రాజకీయాల్లో కొత్త అధికార సమీకరణాలు మొదలయ్యాయి. ఇప్పటివరకు తన పార్టీ ఆధిపత్యంతో నిర్ణయాలు తీసుకున్న ట్రంప్‌కు ఇకపై కాంగ్రెస్‌లో ప్రతిపక్షాన్ని ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ విధానాలు, బడ్జెట్ నిర్ణయాలు, విదేశాంగ వ్యవహారాలు, అధ్యక్షుడి నిర్ణయాలపై పర్యవేక్షణ వంటి అంశాల్లో డెమోక్రాట్లకు కీలక పాత్ర లభించనుంది. ట్రంప్ రెండో విడత పాలనలో ఈ ఫలితాలు ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయాల్లో ఆసక్తికర చర్చగా మారింది. ప్రజలు కేవలం పార్టీని మార్చలేదు. తమ ప్రాధాన్యతలను గుర్తించాలని అధికార పక్షానికి గట్టి సందేశం పంపించారు. ఎన్నికల ఫలితాల వెనుక యుద్ధం, ఆర్థిక ఒత్తిళ్లు, జీవన వ్యయం, అమెరికా విదేశాంగ విధానం వంటి అనేక అంశాలు పనిచేశాయి. వీటిలో ఏ ఒక్క అంశాన్నీ విడిగా చూడలేని పరిస్థితి ఏర్పడింది.

### ఇరాన్‌తో పోరాటం రిపబ్లికన్ల కొంపముంచిందా?

ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ల ఓటమికి ప్రధాన కారణం ఏంటన్న ప్రశ్నకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇచ్చిన సమాధానం ఇప్పుడు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ''మనం ఓడిపోవడానికి కారణం యుద్ధమే'' అంటూ ఆయన చేసిన వ్యాఖ్య ట్రంప్ ప్రభుత్వ విదేశాంగ విధానంపై నేరుగా ప్రశ్నలు లేవనెత్తింది. అమెరికా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తామని, ఇతర దేశాల యుద్ధాల్లో అనవసరంగా జోక్యం చేసుకోబోమని హామీ ఇచ్చిన ట్రంప్ ప్రభుత్వం చివరకు మరో పశ్చిమాసియా యుద్ధంలో అమెరికాను భాగస్వామిగా మార్చిందన్న విమర్శలు ఈ ఎన్నికల్లో ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఇరాన్‌తో యుద్ధం అమెరికా ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి కారణమైంది. ఎన్నికల ప్రచారంలో ట్రంప్ తీసుకున్న సైనిక చర్యను సమర్థించినప్పటికీ ఓటర్లలో గణనీయమైన వర్గం దానిని తప్పుబట్టింది. యుద్ధం వల్ల అమెరికాకు నిజంగా ఏం ప్రయోజనం కలిగిందన్న ప్రశ్న సామాన్య ప్రజల్లో బలంగా వినిపించింది. అమెరికా ఫస్ట్ అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, అమెరికా ప్రజల అవసరాలను పక్కనపెట్టి విదేశీ యుద్ధాలకు ప్రాధాన్యత ఇచ్చిందనే భావన రిపబ్లికన్లకు నష్టం కలిగించింది. గతంలో ఖరీదైన విదేశీ యుద్ధాలకు దూరంగా ఉండాలని చెప్పిన ట్రంప్ రాజకీయ వర్గాలే ఇప్పుడు యుద్ధానికి మద్దతు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విధాన మార్పు పార్టీకి చెందిన సంప్రదాయ మద్దతుదారుల్లోనూ అసంతృప్తిని పెంచింది. ఉపాధ్యక్షుడు వాన్స్ విశ్లేషణ ప్రకారం, ట్రంప్‌కు గతంలో మద్దతు ఇచ్చిన కొందరు ఓటర్లు ఈసారి డెమోక్రాట్ల వైపు మళ్లారు. మరికొందరు ఓటింగ్‌కు దూరంగా ఉండకుండా తమ రాజకీయ వైఖరిని మార్చుకున్నారు. ఈ పరిణామం రిపబ్లికన్ పార్టీకి మరింత ప్రమాదకరంగా మారింది. ఎందుకంటే ట్రంప్‌కు మద్దతు ఇచ్చే ఓటర్లలోనే చీలిక ఏర్పడితే భవిష్యత్తు ఎన్నికల్లో పార్టీ పునాదులు బలహీనపడే అవకాశం ఉంటుంది. దేశ ప్రయోజనాల కోసం యుద్ధం చేస్తున్నామన్న ప్రభుత్వ వాదనను ప్రజలు పూర్తిగా అంగీకరించలేదనే సంకేతాలు ఫలితాల్లో కనిపించాయి. అయితే యుద్ధం ఒక్కటే ఓటమికి కారణం కాదని ఎన్నికల సర్వేలు సూచిస్తున్నాయి. అయినప్పటికీ ట్రంప్ ప్రభుత్వం ఇచ్చిన అమెరికా ఫస్ట్ హామీకి, ఆచరణలో తీసుకున్న నిర్ణయాలకు మధ్య ఏర్పడిన అంతరం ఈ ఎన్నికల్లో కీలక రాజకీయ అంశంగా మారింది.

### వాన్స్ ప్రశ్నలు.. ట్రంప్ విధానాలపై సొంత పార్టీలోనే అసమ్మతి!

ఎన్నికల ఫలితాల అనంతరం జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలు రిపబ్లికన్ పార్టీలో అంతర్గత విభేదాలను బహిర్గతం చేశాయి. 2028 అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలా వద్దా అనే విషయాన్ని ఎన్నికల తర్వాత నిర్ణయిస్తానని గతంలో ప్రకటించిన వాన్స్, తాజా ఓటమి నేపథ్యంలో తన రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ట్రంప్ విధానాల నుంచి కొంత దూరం జరుగుతున్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఆయన సామాజిక మాధ్యమంలో చేసిన సుదీర్ఘ వ్యాఖ్యలో రిపబ్లికన్ల ఓటమికి నాలుగు ప్రధాన కారణాలను ప్రస్తావించారు. మొదటిది ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించాలన్న ప్రజల ఆకాంక్ష. రెండోది నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలన్న డిమాండ్. మూడోది విదేశీ వ్యవహారాల కంటే అమెరికా ప్రయోజనాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్న భావన. నాలుగోది ఇజ్రాయెల్‌తో అమెరికా సంబంధాలను పునఃపరిశీలించాలన్న ప్రజల అభిప్రాయం. ఈ నాలుగు అంశాలూ ట్రంప్ ప్రభుత్వానికి రాజకీయంగా ఇబ్బందికరమైనవే. ముఖ్యంగా ఇరాన్ యుద్ధం విషయంలో వాన్స్ వైఖరిలో వచ్చిన మార్పు చర్చనీయాంశమైంది. గతంలో ఇరాక్ యుద్ధంలో పాల్గొన్న మాజీ మెరైన్‌గా ఆయనకు విదేశీ సైనిక జోక్యాలపై ప్రత్యేకమైన అభిప్రాయాలు ఉన్నాయి. గతంలో అమెరికా అంతులేని యుద్ధాల్లో సైనికులను పంపకూడదని ఆయన వాదించారు. ట్రంప్ ఇరాన్‌పై సైనిక చర్య ప్రారంభించినప్పుడు కూడా వాన్స్ బహిరంగంగా పెద్దగా స్పందించలేదు. ఆ తర్వాత యుద్ధాన్ని సమర్థించే ప్రయత్నం చేసినప్పటికీ ఇప్పుడు ఎన్నికల ఓటమికి అదే ప్రధాన కారణమని పేర్కొనడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ''సెనేట్‌ను వచ్చే ఆరేళ్లపాటు కోల్పోవడం కూడా యుద్ధానికి పెట్టిన మూల్యంగా సమర్థించాలనుకుంటే అలా చేయండి'' అంటూ ఆయన చేసిన వ్యాఖ్య ట్రంప్ వాదనకు భిన్నంగా ఉంది. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుకు ట్రంప్ ఇచ్చిన స్థాయిలో వాన్స్ మద్దతు ప్రకటించలేదు. ఇరాన్ యుద్ధాన్ని పరిష్కరించేందుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను ఇజ్రాయెల్ ప్రభుత్వంలోని కొందరు వ్యతిరేకించడంపై వాన్స్ గతంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. వలస విధానాల విషయంలోనూ మార్పులకు సిద్ధమన్న సంకేతాలు ఇచ్చారు. అక్రమంగా కార్మికులను నియమించుకునే వ్యాపార సంస్థలపై ముందుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అయితే అక్రమ వలసదారులకు సాధారణ క్షమాభిక్ష ప్రకటించాలన్న ప్రతిపాదనను మాత్రం వ్యతిరేకించారు. ఈ విధంగా వాన్స్ చేసిన వ్యాఖ్యలు పార్టీ ఓటమికి కారణాలను వివరించడమే కాకుండా, భవిష్యత్తులో రిపబ్లికన్ నాయకత్వం ఏ దిశగా వెళ్లాలన్న చర్చకు తెరతీశాయి.



**యుద్ధం కంటే బతుకుబండే ముఖ్యం.. మారిన అమెరికా ఓటరు!**

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ ప్రభుత్వానికి ఆర్థిక పరిస్థితులు కూడా గట్టి ఎదురుదెబ్బగా మారాయి. దేశ జీడీపీ వృద్ధి, స్టాక్ మార్కెట్ బలంగా ఉన్నా సామాన్య కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గలేదు. 2026 మూడో త్రైమాసికంలో అమెరికా జీడీపీ 3.4 శాతం వృద్ధి నమోదు చేసినప్పటికీ ప్రజల జీవన పరిస్థితుల్లో ఆశించిన మార్పు కనిపించలేదు. ఆగస్టులో 3.4 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 3.7 శాతానికి పెరిగింది. ముఖ్యంగా హ్యూయల్ ఆయిల్ ధరల పెరుగుదల 52 శాతం నుంచి 74.2 శాతానికి చేరడంతో కుటుంబ బడ్జెట్లు దెబ్బతిన్నాయి. రవాణా ఖర్చులు, నిత్యావసరాల ధరలతో పాటు ఇళ్ల, వాహన రుణాలపై అధిక వడ్డీలు మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులకు గురిచేశాయి. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నా చేతిలో మిగిలే డబ్బు తగ్గుతోందన్న అసంతృప్తి ఓటర్లలో పెరిగింది. అసోసియేటెడ్ ప్రెస్ నిర్వహించిన లక్ష మందికి పైగా ఓటర్ల సర్వేలో పది మందిలో ఆరుగురు ఇరాన్‌పై సైనిక చర్యను తప్పు నిర్ణయంగా అభివర్ణించారు. అయితే యుద్ధం ఒక్కటే ప్రధాన ఎన్నికల అంశం కాలేదు. మూడింట ఒక వంతు మంది మాత్రమే యుద్ధం తమ ఓటుపై ప్రభావం చూపిందని చెప్పగా, దాదాపు సగం మంది జీవన వ్యయం, ప్రభుత్వ అవినీతిని ప్రధాన సమస్యలుగా పేర్కొన్నారు. డెమోక్రాట్లకు ఓటేసిన వారిలో దాదాపు అందరూ యుద్ధాన్ని వ్యతిరేకించగా, రిపబ్లికన్లకు మద్దతిచ్చిన వారిలో 80 శాతం మంది సమర్థించారు. ఈ గణాంకాలు అమెరికాలో రాజకీయ విభజనను స్పష్టం చేస్తున్నాయి. యుద్ధాల కంటే ధరల తగ్గింపు, ఆర్థిక భద్రతే తమకు ముఖ్యమని అమెరికా ఓటర్లు ఈ ఎన్నికల ద్వారా ట్రంప్ ప్రభుత్వానికి స్పష్టమైన సందేశం ఇచ్చారు.

### ఓటమి తర్వాతా మారని ట్రంప్ తీరు.. వైట్‌హౌస్ బాల్‌రూమ్‌పైనే మోజు!

ఎన్నికల్లో చారిత్రక ఓటమి ఎదురైన తర్వాత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలి బహిరంగ కార్యక్రమం రాజకీయ చర్చకు దారితీసింది. నవంబర్ 4న మీడియాను వైట్‌హౌస్‌కు పిలిచిన ఆయన, ఎన్నికల ఫలితాలపై స్పందించకుండా కొత్త బాల్‌రూమ్ నిర్మాణంపై దాదాపు 20 నిమిషాలు మాట్లాడారు. చివరి ఉక్కు దూలం అమర్చే కార్యక్రమంలో పాల్గొని, సున్నపురాయి స్తంభాలు, కొరింథియన్ శైలి రూపకల్పన, భారీ షాండ్లియర్లు, పాలరాతి నేలల గురించి వివరించారు. ఈ నిర్మాణం దేశ గౌరవానికి అవసరమని సమర్థించారు. బాల్‌రూమ్‌తో పాటు హెలికాప్టర్ ల్యాండింగ్ ప్యాడ్‌కు గ్రానైట్ నిర్మాణం, లింకన్ మెమోరియల్ రిఫ్లెక్టింగ్ పూల్ ఆధునికీకరణ, గోల్ఫ్ కోర్సు అభివృద్ధి, పోటోమాక్ నది పక్కన 250 అడుగుల భారీ ఆర్చ్ నిర్మాణం వంటి పనులు చేపడుతున్నారు. ఎన్నికలకు ముందు కూడా ట్రంప్ తన ప్రసంగంలో అభివృద్ధి పనులకే ప్రాధాన్యత ఇచ్చారు. ప్రజలు ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతుంటే విలాసవంతమైన నిర్మాణాలపై దృష్టి పెట్టడంపై సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు వస్తున్నాయి. యుద్ధాన్ని ముగించి ధరల నియంత్రణపై దృష్టి పెట్టాలని రిపబ్లికన్ వ్యూహకర్తలు సూచిస్తున్నా, ట్రంప్ మాత్రం ఇరాన్ అణ్వాయుధాన్ని పొందకుండా అడ్డుకోవడానికే యుద్ధం చేశామని సమర్థిస్తున్నారు. న్యూయార్క్ టైమ్స్, పొలిటికోతో మాట్లాడుతూ యుద్ధ నిర్ణయం సరైనదేనని స్పష్టం చేశారు. మరోవైపు కాంగ్రెస్‌లో డెమోక్రాట్ల ఆధిపత్యం పెరగడంతో అభిశంసనపై ప్రశ్నలు ఎదురవుతున్నాయి. అయినప్పటికీ ట్రంప్ బాల్‌రూమ్ నిర్మాణంపైనే ఆసక్తి చూపడం విమర్శలకు మరింత బలం చేకూరుస్తోంది.

### ట్రంప్ తర్వాత అమెరికా రాజకీయం..
## 2028పై ఇప్పటి నుంచే గురి!

మధ్యంతర ఎన్నికల ఫలితాలు ట్రంప్ ప్రభుత్వానికే కాకుండా అమెరికా భవిష్యత్తు రాజకీయాలకు కీలక మలుపుగా మారాయి. ప్రతినిధుల సభ, సెనేట్ రెండింటినీ డెమోక్రాట్లు కైవసం చేసుకోవడంతో అధ్యక్షుడి నిర్ణయాలను ప్రశ్నించే అవకాశం ప్రతిపక్షానికి పెరిగింది. ముఖ్యంగా ఇరాన్ యుద్ధం కొనసాగింపు, దానికి అవుతున్న ఖర్చు... అమెరికా ప్రయోజనాలపై కాంగ్రెస్‌లో ట్రంప్ ప్రభుత్వానికి గట్టి ప్రశ్నలు ఎదురుకానున్నాయి. మరోవైపు 2028 అధ్యక్ష ఎన్నికలపై ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ రాజకీయ భవిష్యత్తు ఆసక్తికరంగా మారింది. ట్రంప్ విధానాలకు పూర్తిగా మద్దతిస్తే ప్రజా వ్యతిరేకత ఆయనకూ నష్టం కలిగించవచ్చు. అదే సమయంలో ట్రంప్‌కు దూరమైతే పార్టీ సంప్రదాయ మద్దతుదారుల నుంచి వ్యతిరేకత ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడం వాన్స్‌కు పెద్ద సవాలు. ఇజ్రాయెల్‌తో సంబంధాలు, ఇరాన్ యుద్ధం, పశ్చిమాసియా పరిణామాల నేపథ్యంలో అమెరికా తన జాతీయ ప్రయోజనాలకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందన్నది కీలకం కానుంది. ఈ పరిణామాలు భారత్‌కూ వ్యూహాత్మకంగా ముఖ్యమైనవే. రష్యా, చైనా, పశ్చిమాసియా దేశాలతో అమెరికా సంబంధాల్లో వచ్చే మార్పులు భారత్‌కు కొత్త అవకాశాలు కల్పించవచ్చు. మరోవైపు ద్రవ్యోల్బణం, జీవన వ్యయాన్ని నియంత్రించడంలో ట్రంప్ ప్రభుత్వం విఫలమైతే రిపబ్లికన్లకు మరిన్ని సవాళ్లు తప్పవు. మిత్రదేశాలకు మద్దతు ఇవ్వడం వేరు.. వాటి కోసం అమెరికా ప్రయోజనాలను పణంగా పెట్టడం వేరు అన్న వాస్తవాన్ని అమెరికా గుర్తించాల్సిన అవసరం ఉంది. యుద్ధం, ఆర్థిక ఒత్తిళ్లు, రాజకీయ విభేదాల నుంచి అమెరికా ఎలా బయటపడుతుంది? 2028లో రిపబ్లికన్లకు ఎవరు నాయకత్వం వహిస్తారు? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మొత్తంగా ప్రజల జీవన సమస్యలను పక్కనపెట్టి విదేశీ యుద్ధాలకు ప్రాధాన్యత ఇస్తే ఎంతటి బలమైన నాయకుడికైనా ఓటర్లు గుణపాఠం చెబుతారని ఈ ఎన్నికలు నిరూపించాయి.



# ఢిల్లీ నుంచి విశాఖకు వన్డే మ్యాచ్.. వేదిక మార్పు!

భారత్-శ్రీలంక క్రికెట్ సమరానికి వేదిక మారింది. డిసెంబర్ 13న ఢిల్లీలో జరగాల్సిన తొలి వన్డేను విశాఖపట్నానికి మార్చుతూ బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. అరుణ్ జైట్లీ స్టేడియంలో వాతావరణ సమస్యలు తలెత్తే అవకాశం, ప్రతిపాదిత ఆధునికీకరణ పనులను దృష్టిలో ఉంచుకుని ఢిల్లీ క్రికెట్ సంఘం (డీడీసీఏ) చేసిన విజ్ఞప్తితో ఈ మార్పు చోటుచేసుకుంది. దీంతో ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియం మరో అంతర్జాతీయ మ్యాచ్‌కు ఆతిథ్యమివ్వనుంది. 2023 వన్డే ప్రపంచకప్ తర్వాత ఢిల్లీలో జరగాల్సిన తొలి వన్డే కావడంతో ఈ మార్పు ప్రాధాన్యత సంతరించుకుంది. 2017 డిసెంబర్‌లో భారత్-శ్రీలంక టెస్టు సందర్భంగా కాలుష్యం కారణంగా శ్రీలంక ఆటగాళ్లు మాస్కులు ధరించి మైదానంలోకి దిగిన ఘటన ఇప్పటికీ గుర్తుండిపోయింది. తాజా పర్యటనలో శ్రీలంక భారత్‌లో మూడు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది. రెండో టీ20 బెంగళూరులో, మూడో టీ20 అహ్మదాబాద్‌లో జరగనుండగా, వన్డే మ్యాచ్‌లకు రాజ్‌కోట్, కటక్, పుణె వేదికలు కానున్నాయి. ప్రస్తుతం శ్రీలంక పాకిస్తాన్‌తో టెస్టు సిరీస్‌కు సిద్ధమవుతుండగా, భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనలో ఉంది.



వేదిక మారినా.. భారత్-శ్రీలంక పోరులో క్రికెట్ వినోదానికి కొదవ ఉండదన్న అంచనాలు అభిమానుల్లో ఆసక్తి పెంచుతున్నాయి!



# వంద సెంచరీల వేటలో కోహ్లీ

### ప్రపంచకప్‌తో విరాట్ వీడ్కోలు!

38 ఏళ్ల వయసులోనూ విరాట్ కోహ్లీ బ్యాట్ పదును తగ్గలేదు.. పరుగుల వేటలో దూకుడు ఆగలేదు! ఇప్పటికే వన్డే ప్రపంచకప్, టీ20 ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీతో పాటు ఐపీఎల్ టైటిల్‌ను ఖాతాలో వేసుకున్న ఈ రన్‌మెషీన్ ముందు ఇప్పుడు రెండు భారీ లక్ష్యాలు కనిపిస్తున్నాయి. 2027 వన్డే ప్రపంచకప్‌ను ముద్దాడటంతో పాటు అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీల మైలురాయిని అందుకోవాలన్నదే కోహ్లీ తదుపరి ఛాలెంజ్. ప్రస్తుతం 86 శతకాలతో ఉన్న కింగ్‌కు సచిన్ టెండూల్కర్ రికార్డును సమం చేయాలంటే మరో 14 సెంచరీలు అవసరం. టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికినప్పటికీ వన్డేల్లో మాత్రం తన సత్తా చాటుతున్నాడు. 2025లో దక్షిణాఫ్రికాపై రెండు, 2026లో న్యూజిలాండ్‌పై ఒకటి, వెస్టిండీస్‌పై మరో సెంచరీ సాధించి తనలోని జోరును చాటాడు. ప్రపంచకప్‌కు ముందు అందుబాటులో ఉండే సుమారు 30 నుంచి 35 వన్డేల్లో ఈ లక్ష్యాన్ని అందుకోవాలంటే ప్రతి రెండున్నర మ్యాచ్‌లకు ఒక శతకం బాదాలి. అసాధ్యమేమీ కాదు.. ఎందుకంటే కోహ్లీకి వయసు అడ్డంకి కాదు.. ఆకలే అసలైన ఆయుధం! 2027లో ప్రపంచకప్ ట్రోఫీ చేతపట్టి, వందో శతకంతో చరిత్ర సృష్టిస్తాడా? కింగ్ కోహ్లీ అభిమానుల ఎదురుచూపు ఇదే!

### కోహ్లీ 38వ పుట్టినరోజు

#### ప్రేమతో అక్క భావోద్వేగం!

క్రికెట్ మైదానంలో బౌండరీల మోత మోగించే రన్‌మెషీన్ విరాట్ కోహ్లీ 38వ పుట్టినరోజు వేడుకలు అభిమానుల్లో కొత్త ఉత్సాహం నింపాయి. మాజీ సహచరులు, ప్రస్తుత క్రికెటర్లు, బీసీసీఐ పెద్దలు, ఐపీఎల్ ఫ్రాంచైజీలు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తించారు. అయితే వీటన్నింటిలో కోహ్లీ సోదరి భావనా కోహ్లీ దింగ్రా చేసిన భావోద్వేగ పోస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్ననాటి ఫొటోను పంచుకుంటూ "చిన్నచిన్న చేతులు పెద్దయ్యాయి.. నీ హృదయం కూడా అంతే గొప్పగా ఎదిగింది. నీ స్వచ్ఛమైన మనసు నిన్ను ఎప్పుడూ వినయంగా ఉంచుతోంది. అది నాకు ఎంతో గర్వకారణం" అంటూ ప్రేమను చాటుకున్నారు. శిఖర్ ధావన్ కోహ్లీ ఆటపై ఉన్న ఆకలి, అంకితభావాన్ని ప్రశంసించగా, సురేశ్ రైనా అతడిని కింగ్‌గా అభివర్ణిస్తూ అద్భుతమైన కవర్ డ్రైవ్‌లు, చిరస్మరణీయ ఛేజింగ్‌లను గుర్తుచేశాడు. దినేశ్ కార్తీక్ 38 ఏళ్ల వయసులోనూ అదే ఫిట్‌నెస్, అదే దూకుడు కొనసాగిస్తున్నాడని కొనియాడాడు. బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా విరాట్ పోరాట స్ఫూర్తిని ప్రశంసించారు. బీసీసీఐ గణాంకాల ప్రకారం 566 అంతర్జాతీయ మ్యాచ్‌లు, 28,601 పరుగులు, 86 సెంచరీలతో కోహ్లీ తనదైన ముద్ర వేశాడు.



# సీఎస్‌కేలోకి లివింగ్‌స్టోన్..
# రూ.7 కోట్ల త్యాగం!

ఐపీఎల్ 2027 వేలానికి ముందే ఫ్రాంచైజీల మధ్య ట్రేడ్ సమరం మొదలైంది. చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ నాలుగు ఆటగాళ్లతో కూడిన కీలక ట్రేడ్‌ను ఖరారు చేసి క్రికెట్ వర్గాల్లో ఆసక్తి పెంచాయి. ఇంగ్లండ్ విధ్వంసక ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ సన్‌రైజర్స్ నుంచి చెన్నై జట్టులోకి చేరారు. ఇందులో అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నది లివింగ్‌స్టోన్ తీసుకున్న భారీ నిర్ణయం. గతంలో రూ.13 కోట్లకు సన్‌రైజర్స్ కొనుగోలు చేసిన అతడు, ఇప్పుడు రూ.6 కోట్లకే సీఎస్‌కే తరఫున ఆడేందుకు అంగీకరించాడు. అంటే ఏకంగా రూ.7 కోట్ల వేతనాన్ని వదులుకున్నాడు. ఎడ్వర్డ్స్ మాత్రం తన పాత ధర రూ.3 కోట్లకే చెన్నైకి మారాడు. ప్రతిగా భారత పేసర్ ఖలీల్ అహ్మద్ రూ.4.8 కోట్లకు, ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ నాథన్ ఎల్లిస్ రూ.2 కోట్లకు సన్‌రైజర్స్‌లో చేరారు. ఖలీల్ గతంలో 2018-2021 మధ్య హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించగా, ఎల్లిస్ డెత్ ఓవర్లలో తన వైవిధ్యమైన బౌలింగ్‌తో జట్టుకు బలం కానున్నాడు.



# హండ్రెడ్‌కు గుడ్‌బై

### ముంబై పగ్గాలు చేపట్టిన పొలార్డ్!



వెస్టిండీస్ విధ్వంసక వీరుడు కీరన్ పొలార్డ్ కోచింగ్ కెరీర్‌లో మరో కీలక మలుపు! హండ్రెడ్ లీగ్‌లో ఎంఐ లండన్ పురుషుల జట్టు ప్రధాన కోచ్ బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ ప్రధాన కోచ్‌గా ప్రమోషన్ పొందిన నేపథ్యంలో కొత్త బాధ్యతలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడంతో పాటు కొంత విరామం తీసుకోవాలని భావిస్తున్నాడు. 2026 సీజన్‌లో ఎంఐ లండన్‌కు సారథ్యం వహించిన పొలార్డ్ జట్టును నాలుగో స్థానంలో నిలిపాడు. కెప్టెన్ సామ్ కరన్ నేతృత్వంలో జట్టు సమాన పాయింట్లు సాధించినప్పటికీ మెరుగైన నెట్ రన్‌రేట్ లేకపోవడంతో నాకౌట్ అవకాశాన్ని చేజార్చుకుంది. ఇప్పుడు 2027 సీజన్‌కు కొత్త కోచ్ కోసం ఎంఐ లండన్ అన్వేషణ మొదలు కానుంది. మరోవైపు ముంబై ఇండియన్స్ తరఫున 13 సీజన్లలో 189 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన పొలార్డ్, మహేల జయవర్ధనే స్థానంలో ప్రధాన కోచ్ బాధ్యతలు చేపట్టాడు. ఇక సర్రే ప్రధాన కోచ్ గారెత్ బ్యాటీ కూడా చెన్నై సూపర్ కింగ్స్ అసిస్టెంట్ కోచ్‌గా వెళ్లడంతో ది ఓవల్‌లో రెండు కీలక కోచింగ్ ఖాళీలు ఏర్పడ్డాయి. హండ్రెడ్‌లో కోచింగ్ మార్పులతో పాటు ఆటగాళ్ల రిటెన్షన్ ప్రక్రియ కూడా జనవరి మధ్య వరకు కొనసాగనుంది. వచ్చే సీజన్‌లో జట్టు ఐదుగురు విదేశీ ఆటగాళ్లను స్క్వాడ్‌లోకి తీసుకునే అవకాశం ఉండటం మరో ఆసక్తికర పరిణామం.



# కలియుగ రామాయణం

## రావణుడిగా యశ్ విశ్వరూపం

- రామాయణంలో రావణుడిదే పైచేయి!
- కన్పించని రాముడు, మెప్పించిన రావణుడు
- సాంకేతిక అద్భుతం... భావోద్వేగాల లోటు!

దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కించిన 'రామాయణం: పార్ట్ 1' భారతీయ ఇతిహాసాన్ని అంతర్జాతీయ స్థాయి సినిమాటిక్ అనుభూతిగా మలిచే ప్రయత్నం చేసింది. సుమారు 195 నిమిషాల నిడివితో రూపొందిన ఈ చిత్రం సాంకేతికంగా భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ముఖ్యంగా దేవతలు, అసురుల మధ్య యుద్ధం, ఇంద్రుడి ఐరావతంపై రావణుడి దాడి వంటి సన్నివేశాలు అబ్బురపరుస్తాయి. అయితే కథ ప్రారంభం నుంచే రావణుడి ఆధిపత్యానికి దర్శకుడు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. శివభక్తి, తల్లి కైకసి ప్రభావం, బానిసత్వం నుంచి ఎదిగిన తీరు వంటి అంశాలతో రావణుడి పాత్రకు కొత్త కోణాలు చూపించారు. యశ్ తన హిందీ అరంగేట్రంలోనే భయంకరమైన విలనిజంతో ఆకట్టుకున్నారు. శరద్ కేల్కర్ డబ్బింగ్ ఆయన పాత్రకు మరింత బలాన్నిచ్చింది. తొలి భాగంలో యశ్ తెరపై కనిపించిన ప్రతిసారీ సినిమా స్థాయి పెంచింది.

### రాముడి పాత్రలో రణ్‌బీర్ పరిణతి

మరోవైపు రాముడి జీవితంలోని కీలక ఘట్టాలను దర్శకుడు కొంత వేగంగా ముగించారు. విశ్వామిత్రుడి వద్ద విద్యాభ్యాసం, శివధనుస్సు విరిచిన సందర్భం, తండ్రి మాట కోసం 14 ఏళ్ల వనవాసాన్ని అంగీకరించడం వంటి ఘట్టాలకు తగిన భావోద్వేగం కనిపించలేదు. రణ్‌బీర్ కపూర్ మాత్రం రాముడి పాత్రలో ప్రశాంతత, గంభీరత, ఆత్మనిగ్రహాన్ని చక్కగా ప్రదర్శించారు. విలువల కోసం సింహాసనాన్ని వదులుకునే వ్యక్తిగా ఆయన నటన ఆకట్టుకుంటుంది. లక్ష్మణుడిగా రవి దూబే, దశరథుడిగా అరుణ్ గోవిల్, కైకసిగా శోభన తమ పాత్రలకు న్యాయం చేశారు. ముఖ్యంగా శోభన నటన డిజిటల్ హంగుల మధ్య సంప్రదాయ నాట్యాభినయాన్ని గుర్తుచేస్తుంది.

### సీతగా సాయిపల్లవి ప్రత్యేక ఆకర్షణ

సీత పాత్రలో సాయిపల్లవి కొత్తదనం చూపించారు. సంప్రదాయానికి పరిమితమైన సున్నితమైన యువరాణిగా కాకుండా, ఆత్మవిశ్వాసం, ధైర్యం కలిగిన పాత్రగా సీతను ఆవిష్కరించారు. రెండు కత్తులు ధరించి పోరాడే యోధురాలిగా ఆమె కనిపించడం విశేషం. అయితే రామసీతల మధ్య ప్రేమానుబంధాన్ని మరింత సహజంగా చూపించే అవకాశం ఉన్నా, దర్శకుడు కర్తవ్యం, ఆధ్యాత్మికతకే ప్రాధాన్యం ఇచ్చారు. జటాయువుగా అనుపమ్ ఖేర్ గంభీరమైన స్వరంతో ఆకట్టుకున్నారు. రావణుడి చేతిలో జటాయువు పోరాటం భావోద్వేగంతో కూడిన గొప్ప యాక్షన్ ఘట్టంగా నిలుస్తుంది. మరోవైపు లంక, అయోధ్య ప్రపంచాలను నిర్మించడంలో భారీ విజువల్ ఎఫెక్ట్స్ కనిపించినా, కొన్ని రాక్షస పాత్రలు, వస్త్రధారణలో భారతీయ ఇతిహాసానికి ప్రత్యేకత కొరవడింది.

### సాంకేతిక వైభవం.. ఆత్మను తాకని కథనం

ఏఆర్ రెహమాన్, హాన్స్ జిమ్మర్ సంగీతం, డీఎన్‌ఈజీ విజువల్ ఎఫెక్ట్స్ సినిమాకు అంతర్జాతీయ స్థాయి రూపాన్ని తీసుకొచ్చాయి. అయినప్పటికీ సంగీతం ప్రేక్షకుల మనసుల్లో అంతర్లీన భావోద్వేగాలను రగిలించే స్థాయికి చేరలేకపోయింది. కేవల్ ఘట్టం వంటి సామాజిక సమానత్వాన్ని చాటే కీలక సందర్భాన్ని పక్కన పెట్టడం కూడా లోటుగా కనిపిస్తుంది. రావణుడి పాత్రను విస్తృతంగా చూపించే క్రమంలో రాముడి దైవత్వం, మానవీయ సంఘర్షణలు కొంత పలుచబడ్డాయి. అహంకారాన్ని విడిచిపెట్టి ధర్మాన్ని నిలబెట్టడమే రామాయణం అసలు సందేశం. కానీ భారీ సాంకేతిక హంగులు ఆ సందేశాన్ని పూర్తిస్థాయిలో ప్రేక్షకులకు చేరవేయలేకపోయాయి. మొత్తంగా 'రామాయణం: పార్ట్ 1' చూపులను కట్టిపడేసే దృశ్యవైభవాన్ని అందించినా, మనసును కదిలించే భావోద్వేగ అనుభూతిని మాత్రం పూర్తిగా అందించలేకపోయింది.

### రామాయణం.. రావణుడి విశ్వరూపం!

భారతీయ ఇతిహాసం.. ప్రపంచ వెండితెరపై మహాద్భుత దృశ్యకావ్యంగా రూపుదిద్దుకుంటోంది! రాముడి ధర్మబలం.. రావణుడి అహంకార సామ్రాజ్యం.. సీతాదేవి ఔన్నత్యం.. వెరసి నితేశ్ తివారీ తెరకెక్కించిన 'రామాయణం' ఇప్పుడు సినీ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది. తొలి భాగంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి తమదైన ముద్ర వేస్తే.. రావణుడిగా యశ్ మాత్రం తన విశ్వరూపంతో ప్రేక్షకులను కట్టిపడేశారు. పది తలల ప్రతాపం నుంచి శివభక్తి వరకు.. ప్రతీకార జ్వాలల నుంచి పతనం దిశగా సాగిన రావణుడి ప్రయాణం వరకు యశ్ నటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ పాత్ర కోసం ఆయన చేసిన సాధన, తెరపై పలికించిన హావభావాలు ఇప్పుడు ప్రశంసలు అందుకుంటున్నాయి. అయితే సాంకేతిక అద్భుతాలు, భారీ యాక్షన్ ఘట్టాల మధ్య రామాయణ అసలు ఆత్మ ఎంతవరకు ఆవిష్కృతమైందన్న చర్చా మొదలైంది. ఇదిలా ఉంటే.. రెండో భాగంపై అప్పుడే అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రావణుడి కుమారుడు మేఘనాథుడిగా రాఘవ్ జుయల్ మెరుపు పరిచయం.. హనుమంతుడిగా సన్నీ డియోల్ భారీ అవతారం ప్రేక్షకుల్లో ఉత్కంఠ పెంచాయి.

# రామాయణం-2 ఎప్పుడంటే..!

- మేఘనాథుడిగా రాఘవ్ జుయల్
- హనుమంతుడిగా సన్నీ డియోల్!
- 2028 దీపావళికి గ్రాండ్ రిలీజ్

'రామాయణం పార్ట్2'ను 2028 దీపావళి సందర్భంగా విడుదల చేయాలని చిత్ర బృందం నిర్ణయించింది. ఈ ప్రకటనతో అభిమానుల్లో ఇప్పటి నుంచే అంచనాలు పెరిగిపోయాయి.

### మేఘనాథుడిగా రాఘవ్ జుయల్ ఎంట్రీ

రెండో భాగంపై ఆసక్తిని మరింత పెంచుతూ నటుడు రాఘవ్ జుయల్ తెరపై కనిపించారు. రావణుడి పెద్ద కుమారుడు మేఘనాథుడిగా తొలి భాగం చివర్లో ఆయన చిన్న పాత్రలో దర్శనమిచ్చారు. నిడివి తక్కువైనా, ఆయన గంభీరమైన రూపం ప్రేక్షకులను ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో అభిమానులు ఆయన నటనపై ప్రశంసలు కురిపిస్తున్నారు. రెండో భాగంలో మేఘనాథుడి పాత్రకు మరింత ప్రాధాన్యం ఉంటుందని ఆశిస్తున్నారు. తన కొత్త రూపాన్ని పరిచయం చేస్తూ రాఘవ్ చేసిన సోషల్ మీడియా పోస్టు కూడా అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచింది.

### హనుమంతుడిగా సన్నీ డియోల్

మరోవైపు హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్ ఎంట్రీకి కూడా తొలి భాగం వేదికైంది. పోస్ట్ క్రెడిట్ సన్నివేశంలో ఆయన భారీ ఆకృతిని వెనుక నుంచి చూపిస్తూ ఆసక్తి పెంచారు. 'జై శ్రీరామ్' నినాదంతో హనుమంతుడు చేసే భారీ లంఘనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ దృశ్యాలను హనుమాన్ చాలీసా మ్యూజిక్ వీడియోలో చిత్ర బృందం అధికారికంగా విడుదల చేసింది. సుఖ్వీందర్ సింగ్, దిల్జిత్ దోసాంజ్, మోహిత్ చౌహాన్, శంకర్ మహదేవన్, కైలాష్ ఖేర్ ఈ పాటకు తమ గాత్రాన్ని అందించారు.

### రెండో భాగంపై భారీ అంచనాలు

రెండో భాగంలో యుద్ధ ఘట్టాలను ఎలా ఆవిష్కరిస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మేఘనాథుడి పరాక్రమం, హనుమంతుడి వీరత్వం, రామరావణ యుద్ధం వంటి కీలక ఘట్టాలు ప్రేక్షకులకు కనువిందు చేయనున్నాయి. ఏఆర్ రెహమాన్, హాన్స్ జిమ్మర్ సంగీతం ఈ భారీ చిత్రానికి మరో ప్రత్యేక ఆకర్షణ. 2028 దీపావళి లక్ష్యంగా సిద్ధమవుతున్న రెండో భాగం.. భారతీయ సినీ చరిత్రలో మరో భారీ దృశ్యకావ్యంగా నిలుస్తుందా? అన్నది వేచి చూడాలి.



# రావణుడిగా యశ్..అద్భుతం

- పది తలల రావణుడికి సరికొత్త రూపం
- ప్రతినాయకుడి పాత్రలో పరకాయ ప్రవేశం
- నటనతో జాతీయ స్థాయిలో మరోసారి సత్తా!

రామాయణం అనగానే పది తలల రావణుడు గుర్తుకొస్తాడు. అయితే నితేశ్ తివారీ తెరకెక్కించిన 'రామాయణం: పార్ట్ 1'లో కన్నడ స్టార్ యశ్ ఈ పాత్రకు సరికొత్త రూపాన్ని తీసుకొచ్చారు. రావణుడి పది తలల భావనను అద్భుతమైన సాంకేతికతతో తెరపై ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తోంది. మూడు గంటలకు పైగా సాగే ఈ భారీ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి నటించారు. అయితే తెరపై రావణుడి పాత్ర కనిపించిన ప్రతిసారీ కథకు ప్రత్యేక ఆకర్షణ ఏర్పడుతోంది. ఈ పాత్ర రూపకల్పనలో దర్శకుడు తీసుకున్న శ్రద్ధ, యశ్ చేసిన కృషి తొలి ప్రదర్శనల నుంచే ప్రశంసలు అందుకుంటున్నాయి.

### రావణుడి పాత్రపైనే యశ్ ఆసక్తి

ఈ సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచి ప్రధాన పాత్రల ఎంపికపై చర్చ జరిగింది. రణ్‌బీర్, యశ్, సాయిపల్లవి ఇతిహాస పాత్రలకు ఎంతవరకు సరిపోతారనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే రావణుడి పాత్ర తనకు అత్యంత ఆసక్తికరమని యశ్ మొదటి నుంచీ చెబుతూ వచ్చారు. ఇతర పాత్రల్లో నటించే అవకాశం ఉన్నా రావణుడినే ఎంచుకుంటానని స్పష్టం చేశారు. కేజీఎఫ్ చిత్రాలతో ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లో తనదైన ముద్ర వేసిన యశ్‌కు ఈ పాత్ర సహజంగా సరిపోయింది. గతంలో 'మాస్టర్‌పీస్' సినిమాలోనూ రావణుడు, హిరణ్యకశిపుడి వేషధారణపై తన అభిరుచిని వ్యక్తం చేయడం విశేషం. రావణుడిలోని భిన్నమైన కోణాలే తనను ఆకర్షించాయని ఆయన వెల్లడించారు.

### పాత్ర కోసం ప్రత్యేకమైన సాధన

రావణుడి శరీర భాష, వ్యక్తిత్వం, ఆగ్రహం, ప్రతీకార స్వభావాన్ని అర్థం చేసుకునేందుకు యశ్ ప్రత్యేకంగా సిద్ధమయ్యారు. అన్నీ ఉన్నప్పటికీ తన చర్యల వల్లే అన్నింటినీ కోల్పోయిన వ్యక్తి రావణుడని ఆయన విశ్లేషించారు. తాను ఎప్పుడూ వ్యతిరేకించిన వ్యక్తిలాగే చివరకు మారిపోవడం ఆ పాత్రలోని విషాదమని వివరించారు. షూటింగ్ సమయంలో తనను తాను ఆ పాత్రలోకి తీసుకెళ్లేందుకు శివ మంత్రాలు, శివ గీతాలు వినిపించేవారని తెలిపారు. కన్నడ చిత్ర పరిశ్రమలో సందడిగా సాగే షూటింగ్ వాతావరణానికి భిన్నంగా, రామాయణం సెట్స్‌లో నిశ్శబ్దం ఎక్కువగా ఉండేదని చెప్పారు. అందుకే శివ గీతాలతో వాతావరణాన్ని మార్చుకుని నటనకు అవసరమైన మానసిక స్థితిని పొందానని వెల్లడించారు.

### రావణుడిని ఆరాధించొద్దన్న యశ్

రావణుడి పాత్రకు ప్రేక్షకులు ఆకర్షితులైనా, ఆ పాత్రను ఆదర్శంగా తీసుకోవద్దని యశ్ స్పష్టం చేశారు. సినిమాలో తన పాత్రకు మద్దతు ఇవ్వొచ్చని, కానీ రావణుడి స్వభావాన్ని జీవితంలోకి తీసుకెళ్లవద్దని సూచించారు. తొలి ప్రదర్శనల్లో ఆయన నటనకు మంచి స్పందన లభించినప్పటికీ, సంభాషణల పలుకుబడిలో అక్కడక్కడా చిన్న లోపాలు కనిపించాయని సమీక్షలు పేర్కొన్నాయి. నమిత్ మల్హోత్రా నిర్మించిన ఈ చిత్రం యశ్‌ను దేశవ్యాప్తంగా మరింత చేరువ చేసే అవకాశముంది. కేజీఎఫ్‌తో సంపాదించిన పాన్ ఇండియా గుర్తింపును మరో స్థాయికి తీసుకెళ్లే వేదికగా నిలవనుంది. గత చిత్రం 'టాక్సిక్' ఆశించిన ఫలితం ఇవ్వకపోయినా, అందులో సంక్లిష్టమైన పాత్రలో యశ్ నటన ఆకట్టుకుంది. పట్టుదల, విభిన్న పాత్రల ఎంపికతో ఎదిగిన ఆయనకు రావణుడి పాత్ర మరో కీలక మైలురాయిగా నిలిచే సూచనలు కనిపిస్తున్నాయి.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.